JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రభాత

# జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 06-08-2026

Medchal - Malkajgiri । Thursday 06-08-2026

Follow: jayabherinews

సంపుటి : 03 । సంచిక : 66

పేజీలు : 8 । వెల : 5

Vol. 03 । Issue 66 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com



## క్రీడారంగంలో కొత్త అధ్యాయం..

# కోస్తాంధ్రకు గర్వకారణం

- భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఏర్పాటు చేస్తున్న 'సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' నిర్మాణ పనులకు మంత్రి నారా లోకేశ్ భూమిపూజ
- చిన్నతనం నుంచి తాను సాగించిన క్రీడా ప్రయాణం, కోచ్‌లు అందించిన ప్రోత్సాహం, ఎదురైన సవాళ్లను మనసులో ఉంచుకుని ఈ కేంద్రానికి సింధు శ్రీకారం



2 లో

**జయభేరి, విశాఖపట్టణం, ఆగస్టు 5 :**

తెలుగు నేల ఇచ్చిన అపూర్వ క్రీడారత్నం పీవీ సింధు తన జీవితకాల స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. సాగర తీర నగరం విశాఖపట్నం వేదికగా అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న 'పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' అకాడమీ శంకుస్థాపన మహోత్సవం ఘనంగా జరిగింది. పి.వి. సింధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా భావి తరాల క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. విశాఖపట్నం క్రీడా రంగంలో మరో కీలక ముందడుగు పడింది. భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఏర్పాటు చేస్తున్న 'సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శంకుస్థాపన చేశారు. అరిలోవ సమీపంలోని తోటగరువులో ఈ అకాడమీని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి లోకేశ్‌కు పీవీ సింధు, ఆమె కుటుంబ సభ్యులు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.



## తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపనకు

# అనుమతలు ఇప్పించండి

- తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం
- తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు అవకాశం
- సీఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, న్యూఢిల్లీ:**

ప్రాణహిత నదిపై తుమ్మిడి హెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జల్శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి జల్శక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్శక్తి శాఖకు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తు చేశారు. 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మాణంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (CWPRS) అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రి కి వివరించారు. CWPRS అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో నిర్మించినా

...మిగతాది 2 లో

# ప్రధాని వీడియో తొలగింపుపై జుకర్‌బర్గ్‌కు 3 రోజుల గడువు

- క్షమాపణ చెప్పి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిటీ సూచన



**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 5 :**

భారత ప్రధాని నరేంద్ర మోదీ వీడియోను ఫేస్‌బుక్‌లో కొద్దిసేపు తొలగించిన ఘటనపై మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌కు కేంద్ర ప్రభుత్వం మూడు రోజుల గడువు విధించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీ సూచించింది.బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నేతృత్వంలోని ఈ కమిటీ, ప్రధాని వీడియో తొలగింపును ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్యగా అభివర్ణించింది.

...మిగతాది 2 లో




2 లో

## డయల్ 100 కాదు..

# డయల్ 112 ఇక ఇదే..

- అత్యవసర సేవలకు ఇక ఇదే నంబర్
- డయల్ 112 సేవలు ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్
- ఏకంగా 18 ఎమర్జెన్సీ సేవలు ఒకే గొడుగు కింద.!

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 5 :**

రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, వాగ్వాదాలు, మహిళలపై వేధింపులు, ఇతర అన్ని రకాల అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే స్పందన లభించేలా వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ సీవీ ఆనంద్ ఒక ప్రకటనలో వెల్లడించారు. తెలంగాణలో ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముఖ్యంగా శాంతి భద్రతలపై ఫోకస్ పెట్టింది. ఇటీవల కాలంలో హైదరాబాద్ నగరంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పినట్లు వార్తలు వస్తున్నాయి. హత్యలు, గ్యాంగ్ వార్ లు , చోరీలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ప్రజలు పోలీసులు ఏంచేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ పోలీసుశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో అత్యవసర సేవల కోసం 112 నంబర్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు వేర్వేరు నంబర్లను ఉపయోగించగా, ఇక నుంచి వీటికి ఒకే డయల్ 112 అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్‌లో కొత్త ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. కొత్త విధానంతో పోలీసు, అంబులెన్స్, ఫైర్ సర్వీసులతో పాటు అత్యవసర సేవలు ఒకే వేదికపైకి వస్తాయని తెలిపింది.

## హైడ్రా చీఫ్ రంగనాథ్

# సంతకం ఫోర్జరీ

- 8 ప్రముఖ కాలేజీల అక్రమాల రట్టు!



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 5 :**

హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న 'హైడ్రా' పేరును వాడుకుని కొందరు అక్రమాలకు యత్నించిన తీరు తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ 'ఫైర్ ఎన్‌ఓసీ' (NOC) పత్రాలను తయారు చేసిన ఒక ముఠా గుట్టు రట్టయింది. ఏకంగా నగరంలోని 8 ప్రముఖ ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఈ నకిలీ సర్టిఫికెట్ల ఆధారంగా గుర్తింపు పొందేందుకు యత్నించడం విద్యాశాఖతో పాటు పోలీసు వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.



## మూడేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి తీసుకురాలేదు

- మాజీ మంత్రి హరీష్ రావు

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ భవన్లో మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. ఈనెల 18న హైదరాబాద్ వేదికగా జీఆర్ఎంబీ (GRMB) సమావేశం జరగబోతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చెరో ఎజెండాను సిద్ధం చేసుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వం మౌనం చూస్తుంటే... జీఆర్ఎంబీ సమావేశం కేవలం ఏపీ ప్రయోజనాల కోసమే జరుగుతోందా? అనే అనుమానం కలుగుతోంది. ఎజెండా వచ్చి ఇన్ని రోజులు అవుతున్నా తెలంగాణ ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ఏపీ ప్రతిపాదించిన అంశాలు చూస్తే తెలంగాణ ఆత్మగౌరవం ఉన్న ప్రతి ఒక్కరి కడుపు మండక మానదు. రక్తం మరిగిపోక తప్పదు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసే కుట్రలను పటాపంచలు చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నారు?

...మిగతాది 2 లో

# 8 సెకన్లలో నిద్రపట్టేస్తుంది

- 3 గంటలే నిద్ర.. ప్రధాని మోదీ



**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 5 :**

ఏడు పదుల వయసులోనూ ప్రధాని నరేంద్ర మోదీ చాలా చురుకుగా, ఉత్సాహంగా కనిపిస్తారు. ఆయనలా ఉండాలని చాలా మంది కోరుకుంటూ ఉంటారు. కానీ అది అందరికీ సాధ్యపడదు. తాజాగా ప్రధాని మోదీ తన దినచర్యపై కీలక విషయాలను వెల్లడించారు. తనకు కేవలం 8 సెకన్లలోనే నిద్ర పట్టేస్తుందని అన్నారు. తాను కేవలం 3 గంటలు మాత్రమే నిద్ర పోతానని స్పష్టం చేశారు. ఎన్డీయే నుంచి కొత్తగా రాజ్యసభకు ఎన్నికైన ఎంపీలతో ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా సమావేశం అయ్యారు.

...మిగతాది 2 లో

# హైకోర్టులో కేటీఆర్‌కు భారీ ఊరట

- కోర్టు ముందుకు వచ్చిన ఆరోపణలు
- న్యాయస్థానం ఏం చెప్పిందంటే..
- అలాంటి పిటిషన్లపై ధర్మాసనం సీరియస్..!



**జయభేరి, హైదరాబాద్ :**

మాజీమంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. సిరిసిల్లా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఈ తీర్పుపై కేటీఆర్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును చట్టబద్ధంగా ఎదుర్కోలేక,వ్యక్తిగత కక్షలతోనే కోర్టులను ఆశ్రయిస్తున్నారనే వాదనలకు ఈ నిర్ణయంతో గట్టి జవాబు లభించినట్లయిందని పార్టీ క్యాడర్ పేర్కొంది.

...మిగతాది 2 లో




## ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతకర్త

నేడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సర్ వర్ధంతి

2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## అనుమతలు ఇప్పించండి

ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందని తెలిపారు. ముంపులో 50 శాతం నదీ గర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని చెప్పారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా అవసరమైన నీటి సరఫరా సాధ్యం కాదని, అందువల్ల 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ని ముఖ్యమంత్రి కోరారు. తుమ్మిడి హెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరా వల్ల విద్యుత్ వినియోగ భారం తగ్గుతుందని వివరిస్తూ, ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని జల్శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి వసతి ఏర్పడుతుందని వివరించారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని జల్శక్తి మంత్రి ముఖ్యమంత్రి కి తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మూడేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి తీసుకురాలేదు

గుడ్డి గుర్రం పళ్లు తోముతున్నారా? లేక తెలంగాణ నీటి ప్రయోజనాలను గంపగుత్తగా ఏపీకి తాకట్టు పెట్టాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. చంద్రబాబు తెలంగాణకు ద్రోహం చేయాలని చూస్తుంటే... రేవంత్ రెడ్డి రక్తం ఎందుకు మరిగడం లేదు? తెలంగాణ సోయి లేదా? తెలంగాణ ఆత్మగౌరవం లేదా? గురుదక్షిణ కోసమేనా ఈ మౌనం? ప్రతిపక్షాలపై అడ్డగోలుగా మాట్లాడే రేవంత్ రెడ్డి... పక్క రాష్ట్రం తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తుంటే ఎందుకు మాట్లాడటం లేదు? "గుడ్లు పీకుతా... పేగులు మెడలో వేసుకుంటా" అంటూ రాక్షస భాష మాట్లాడే రేవంత్ రెడ్డి... చంద్రబాబు విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదు? చంద్రబాబు అంటే అంత భయమా అని నిలదీసారు. తెలంగాణ జల ప్రయోజనాలను శాశ్వతంగా సమాధి చేసే విధంగా పక్క రాష్ట్రం కుట్రలు చేస్తోంది. ఈనెల 18న జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా చూస్తే ఏపీ ఎంత వితండవాదం చేస్తుందో స్పష్టంగా అర్థమవుతుంది. తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ మొత్తం విషం చిమ్మింది. చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను తాను ఎప్పుడూ వ్యతిరేకించలేదని పదేపదే చెబుతారు. కానీ జీఆర్ఎంబీ ముందు పెట్టిన ఎజెండా చూస్తే అసలు నిజం ఏంటో అర్థమవుతుంది. కాళేశ్వరం, చౌటుపల్లి హన్మంతరావు, చిన్న కాళేశ్వరం, చనాకాకొరటా, మోదికుంట వాగు, కడెం గూడెం లిఫ్ట్, సీతారామ లిఫ్ట్ వంటి ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులను నిలిపివేయాలని, వాటిని పునఃసమీక్షించాలని ఏపీ కోరుతోంది. సమ్మక్క బ్యారేజీకి సంబంధించిన క్లియరెన్సులను కూడా నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తోంది. కొత్తగా అనుమతులు ఇవ్వాలని కాదు... కేసీఆర్ ప్రభుత్వం సాధించిన ఈ ఏడు ప్రాజెక్టుల అనుమతులను రివ్యూ చేయాలని ఏపీ కోరుతోంది. ప్రతిపాదనను జీఆర్ఎంబీ ఎజెండాలో చేర్చడం అత్యంత దుర్మార్గమైన విషయం. ఖమ్మం జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు వస్తున్నాయంటే... కేసీఆర్ ప్రభుత్వం సాధించిన అనుమతుల వల్లే. ఇప్పుడు అదే సీతారామ ప్రాజెక్టు అనుమతులను రద్దు చేయాలని ఏపీ కోరుతోంది. తెలంగాణకు చెందిన ఏడు కీలక ప్రాజెక్టుల అనుమతులను నిలిపివేయాలని ఏపీ ప్రతిపాదిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తోంది? తెలంగాణ ఇంజినీర్లు ఏం చేస్తున్నారు? ఇప్పటికే అనుమతులు సాధించిన ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే అధికారం ఎవరు ఇచ్చారు? తెలంగాణ కోసం ఉద్యమం చేసి, పోరాడి కేసీఆర్ ప్రభుత్వం 383 టీఎంసీల గోదావరి జలాలకు అనుమతులు సాధించింది. ఇప్పుడు ఆ అనుమతులను రద్దు చేసే పరిస్థితి ఎందుకు వచ్చింది? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు మూడేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి తీసుకురాలేదని మండిపడ్డారు.

## హైడ్రా చీఫ్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

హైడ్రా కార్యాలయం నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే, కమిషనర్ పేరు మీద దొంగ సంతకాలతో ఫేక్ ఎన్ఓసీలు సృష్టించారు. ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అఫిలియేషన్ (అనుమతులు) సాధించడం కోసం సదరు ప్రైవేటు కాలేజీలు ఈ నకిలీ పత్రాలను సమర్పించాయి. అయితే బోర్డు అధికారులు, హైడ్రా యంత్రాంగం డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని, వారి సంతకాలు ఫోర్జరీకి గురయ్యాయని తేలింది. ఈ దారుణ అక్రమంపై స్పందించిన హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు.. మోసానికి పాల్పడిన 8 కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్లో అధికారికంగా ఫిర్యాదు చేశారు.

ఫోర్జరీకి పాల్పడిన జూనియర్ కాలేజీలు ఇవే... శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, చాంద్రాయణగుట్ట, రెసోనెన్స్ జూనియర్ కాలేజ్, ఎస్ఆర్ నగర్, హైందవి జూనియర్ కాలేజ్, బర్కత్‌పుర, ప్రియాం జూనియర్ కాలేజ్, మెహదీపట్నం, న్యూ ఎరా జూనియర్ కాలేజ్, చిక్కడపల్లి. మదర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజ్, విద్యానగర్. షాహీన్ జూనియర్ కాలేజ్, శివరాంపల్లి. వశిష్ట జూనియర్ కాలేజ్, తెల్లాపూర్.

## హైకోర్టులో కేటీఆర్‌కు భారీ ఊరట

గత ఎన్నికల్లో కేటీఆర్ చేతిలో ఓటమి పాలైన కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్ రెడ్డి ఈ సుదీర్ఘ న్యాయపోరాటానికి తెరలేపారు.నామినేషన్ అఫిడవిట్‌లో కేటీఆర్ తన ఆస్తులు,అప్పుల వివరాలను ఉద్దేశపూర్వకంగా దాచారంటూ ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఎన్నికల పిటిషన్ గత కొద్దికాలంగా రాజకీయ వర్గాల్లో పెను సంచలనాన్ని సృష్టించడమే కాకుండా,ఇరు పార్టీల నాయకుల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తించింది.

**కోర్టు ముందుకు వచ్చిన ఆరోపణలు ఇవే..**

హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఒక నివాస భవనాన్ని కేటీఆర్ తన ఆస్తిగా చూపించలేదని పిటిషనర్ ఆరోపించారు. దాదాపు రూ.10.50 లక్షలు, రూ.88.15 లక్షల రుణాలకు సంబంధించిన వివరాల వెల్లడిలో కూడా అస్పష్టత ఉందని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేటీఆర్ కుమారుడి పేరిట జరిగిన భూముల కొనుగోళ్లు, కుటుంబ సభ్యుల పేరిట ఉన్న మరికొన్ని ఆస్తుల వివరాలను కూడా ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో దాచిపెట్టారంటూ మహేందర్ రెడ్డి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**న్యాయస్థానం ఏం చెప్పిందంటే..**

ఈ సుదీర్ఘ వాదనలను సునిశితంగా పరిశీలించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు మంగళవారం కీలక తీర్పును వెలువరించారు. కేవలం అభ్యర్థి అర్హతలపై అనుమానాలతో ఆధారాలు లేకుండా దాఖలు చేసే పిటిషన్లను అంగీకరించబోమని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం సరైన ఆధారాలు ఉంటేనే ఎన్నికల పిటిషన్‌ను విచారించాల్సి ఉంటుందని గుర్తు చేస్తూ, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలకు లోబడే ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయంగా ఎన్నో వ్యక్తిగత ఆరోపణలు, విమర్శల మధ్య నలిగిన ఈ కేసు చివరకు వీగిపోవడంతో కేటీఆర్ అభిమానులకు పెద్ద ఉపశమనం లభించినట్లయింది. ప్రజాసేవ చేస్తున్న తమ నేతపై ప్రత్యర్థులు చేసిన బురదజల్లే ప్రయత్నాలు చివరకు పటాపంచలయ్యాయని బీఆర్ఎస్ శ్రేణులు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఈ చారిత్రక తీర్పుతో సిరిసిల్ల ఓటర్ల పవిత్రమైన తీర్పును న్యాయస్థానం గౌరవించినట్లయిందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక..
# ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతకర్త

✍ జయభేరి, హైదరాబాద్ :



తెలంగాణ చరిత్రలో కొన్ని పేర్లు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. అలాంటి మహనీయుల్లో అగ్రగణ్యుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్. ఆయన కేవలం ఒక విద్యావేత్త మాత్రమే కాదు... తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంతకర్త, ప్రజా మేధావి, నిరాడంబర వ్యక్తిత్వానికి నిలువెత్తు నిదర్శనం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆరు దశాబ్దాలకు పైగా నిరంతర పోరాటం చేసిన ఆయన జీవితం ఉద్యమ చరిత్రతో విడదీయరాని బంధాన్ని కలిగి ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు, ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తూనే ఉన్నాయి.ప్రొఫెసర్ జయశంకర్ 1934 ఆగస్టు 6న వరంగల్ జిల్లా అక్కంపేట గ్రామంలో జన్మించారు. చిన్ననాటి నుంచే తెలంగాణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను ప్రత్యక్షంగా చూశారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురావచ్చని విశ్వసించిన ఆయన ఆర్థిక శాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించి అధ్యాపకుడిగా తన సేవలను ప్రారంభించారు. అనంతరం కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, పరిపాలనాధికారిగా, చివరకు ఉపకులపతిగా అత్యున్నత బాధ్యతలు నిర్వహించారు.1991 నుండి 1994 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ జయశంకర్ విద్యా రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. విశ్వవిద్యాలయంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వడం, పారదర్శక పరిపాలనను అమలు చేయడం, గ్రామీణ మరియు పేద విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బందితో సమన్వయంగా వ్యవహరిస్తూ కాకతీయ విశ్వవిద్యాలయాన్ని విద్యా, పరిశోధనా రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించారు. ఉపకులపతిగా బాధ్యతలు నిర్వహిస్తూనే తెలంగాణ సమస్యలపై అధ్యయనం, ప్రజల్లో చైతన్యం కల్పించడం, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని వివరించడం వంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించారు. జయశంకర్ ఉద్యమ ప్రస్థానం 1952లో జరిగిన ముల్కీ ఉద్యమంతో ప్రారంభమైంది. స్థానికులకు ఉద్యోగ రక్షణ కల్పించాలనే డిమాండ్‌తో సాగిన ఆ ఉద్యమం తెలంగాణ ప్రాంతంలో ప్రాంతీయ చైతన్యానికి నాంది పలికింది. 1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణకు ఇచ్చిన జెంటిల్‌మెన్స్ అగ్రిమెంట్, ముల్కీ నిబంధనలు, ఇతర రాజ్యాంగ హామీలు అమలుకాకపోవడంతో తెలంగాణ ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. ఈ పరిణామాలను జయశంకర్ లోతుగా అధ్యయనం చేసి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గణాంకాలతో, ఆధారాలతో ప్రజలకు వివరించారు.1969లో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడినప్పుడు జయశంకర్ ఉద్యమానికి మేధో బలాన్ని అందించారు. వేలాది మంది విద్యార్థులు, యువకులు ఉద్యమంలో పాల్గొనగా, వందలాది మంది అమరులయ్యారు. రాజకీయ పరిణామాల కారణంగా ఉద్యమం తాత్కాలికంగా వెనుకబడినా, జయశంకర్ మాత్రం తన లక్ష్యాన్ని విడిచిపెట్టలేదు. ప్రత్యేక తెలంగాణ సాధనే శాశ్వత పరిష్కారమని ఆయన జీవితాంతం నమ్మి ప్రచారం చేశారు. తెలంగాణకు నీటి పంపిణీ, ఉద్యోగాలు, బడ్జెట్ కేటాయింపులు, విద్య, సాగునీరు, పరిశ్రమలు వంటి అన్ని రంగాల్లో జరిగిన వివక్షను ఆయన శాస్త్రీయంగా విశ్లేషించారు. కృష్ణా, గోదావరి నదుల జలాల వినియోగంలో తెలంగాణకు జరిగిన అన్యాయం, ప్రాంత ఆదాయ పంపిణీలో అసమానతలు,



✍ ఆళవందార్ వేణు మాధవ్
హైదరాబాద్, 8686051752

స్థానిక యువతకు ఉద్యోగాల్లో జరిగిన నష్టం వంటి అంశాలను గణాంకాలతో దేశ ప్రజలకు వివరించారు. భావోద్వేగాలతో పాటు వాస్తవాలను కూడా సమాజం ముందు ఉంచి ఉద్యమానికి బలమైన సిద్ధాంతపరమైన పునాది వేశారు.

1990వ దశకంలో తెలంగాణ ఉద్యమం తిరిగి బలపడటంలో జయశంకర్ పాత్ర అత్యంత కీలకం. విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, మేధావులు, రచయితలు, ప్రజా సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఉద్యమానికి దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ఉద్యమం ఏ ఒక్క రాజకీయ పార్టీది కాదని, అది ప్రజల ఆత్మగౌరవ ఉద్యమమని ఆయన స్పష్టం చేశారు.2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడిన తర్వాత ఉద్యమానికి సిద్ధాంతపరమైన మార్గదర్శిగా ఆయన నిలిచారు. ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని జాతీయ స్థాయిలో వివరించి ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే తెలంగాణ సాధించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జరిగిన అనేక సమావేశాలు, సదస్సులు, చర్చల్లో పాల్గొని తెలంగాణ డిమాండ్ న్యాయబద్ధమైనదని వివరించారు.2009 తర్వాత తెలంగాణ ఉద్యమం అత్యంత ఉధృతంగా సాగింది. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, కళాకారులు, మేధావులు ఉద్యమంలో భాగమయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉద్యమానికి కేంద్రంగా మారింది. సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం వంటి కార్యక్రమాలు తెలంగాణ ఉద్యమాన్ని జాతీయ చర్చగా మార్చాయి. ఈ ఉద్యమానికి జయశంకర్ సిద్ధాంతాలే ప్రాణం పోశాయి.దురదృష్టవశాత్తు 2011 జూన్ 21న ప్రొఫెసర్ జయశంకర్ కన్నుమూశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని ప్రత్యక్షంగా చూడకపోయినా, ఆయన ఆశయాన్ని ప్రజలు తమ లక్ష్యంగా స్వీకరించారు. చివరకు 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడం ద్వారా ఆయన కల సాకారమైంది. అందుకే తెలంగాణ ప్రజలు ఆయనను "తెలంగాణ సిద్ధాంతకర్త", "తెలంగాణ పితామహుడు"గా గౌరవిస్తారు.ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలు కేవలం రాష్ట్ర ఏర్పాటు వరకు మాత్రమే పరిమితం కాలేదు. సమాన అభివృద్ధి, సామాజిక న్యాయం, స్థానికులకు ప్రాధాన్యం, రైతు సంక్షేమం, నాణ్యమైన విద్య, పారదర్శక పాలన, వనరులపై తెలంగాణ ప్రజల హక్కు వంటి విలువలను ఆయన ఎల్లప్పుడూ ప్రోత్సహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఈ ఆశయాలను ఆచరణలోకి తీసుకురావడం ప్రతి ప్రభుత్వానికీ, ప్రతి పౌరుడికీ బాధ్యత.నేటి యువతకు జయశంకర్ జీవితం ఒక గొప్ప పాఠం. పదవులు, అధికారాలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజం కోసం జీవించవచ్చని ఆయన నిరూపించారు. నిరాడంబర జీవనం, నిజాయితీ, నిబద్ధత, శాస్త్రీయ దృక్పథం, ప్రజల పట్ల అంకితభావం ఆయన వ్యక్తిత్వానికి ప్రతీకలు. అందుకే ఆయన భౌతికంగా లేకపోయినా తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవిస్తున్నారు.

**(ఆగస్టు 6 న ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సర్ వర్ధంతి)**

## 8 సెకన్లలో నిద్రపట్టేస్తుంది

ఈ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక ఇదే సమావేశంలో ఫారిన్ టూర్స్ గురించి మాట్లాడుతూ.. తాను విమానం ఎక్కగానే వెళ్తున్న దేశం కాలమానానికి తగ్గట్టుగా వాచ్ లో సమయాన్ని సర్దుబాటు చేసుకుంటానని పేర్కొన్నారు. దాంతో తాను ఏ దేశానికి వెళ్లినా ఎటువంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. బుధవారం పార్లమెంట్ సమావేశాలకు ముందు అల్పాహారం సందర్భంగా కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ దాదాపు గంటపాటు సమావేశం నిర్వహించారు. వీరిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా ఉన్నారు. ఈ సమావేశంలో కొత్త ఎంపీల వ్యక్తిగత ప్రవర్తన సహా రాజ్యసభలో ప్రతిపక్షాలతో ఎలా వ్యవహరించాలనే అంశాలపై వారికి ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు. వీలైనంత ఎక్కువ సమయాన్ని సభకే కేటాయించాలని అన్నారు. వంద శాతం అటెండెన్స్ ను మెయింటెన్ చేయాలని సూచించారు. ఇక ఇదే సమయంలో తన వ్యక్తిగత దినచర్య గురించి తెలుసుకునేందుకు ఎంపీలు ఆసక్తి చూపారు. ఈ మేరకు ప్రధాని మోదీని దిన చర్య అడిగారు. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ మాట్లాడుతూ.. తాను నిద్ర పోయేందుకు కళ్లు మూసుకోగానే 8 సెకన్లలోనే నిద్ర పట్టేస్తుందని తెలిపారు. అలాగే తాను కేవలం 3 గంటలు మాత్రమే నిద్ర పోతానని పేర్కొన్నారు. ఈ మేరకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీవితంలో ఉత్తమ ఫలితాలు సాధించాలంటే వర్తమానంలో జీవించడం ఎంతో ముఖ్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రధాని మోదీ దినచర్య నేటి జెన్ జీ యువతకు దిక్సూచిగా ఉపయోగపడుతుందని సోషల్ మీడియాలో పలువురు కామెంట్స్ పెడుతున్నారు.

## ప్రధాని వీడియో తొలగింపుపై..

దేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాని వీడియోను తొలగించడం తీవ్రమైన విషయంగా పేర్కొంది.మూడు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ఫేస్‌బుక్‌కు ప్రస్తుతం ఉన్న 'సేఫ్ హార్బర్' రక్షణను తొలగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించినట్టు సమాచారం. అలా జరిగితే సోషల్ మీడియా సంస్థ అధికారులపై నేరుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే అవకాశం ఉంటుందని తెలిపింది.జులై 23న ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సెల్ఫీ వీడియోను పోస్టు చేశారు. తర్వాత అదే వీడియోను ఫేస్‌బుక్‌లో కూడా షేర్ చేశారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రశ్నాపత్రాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని దాంట్లో హామీ ఇచ్చారు. అయితే ఫేస్‌బుక్‌లో ఆ వీడియో కొద్దిసేపు కనిపించకుండా పోవడంతో వివాదం చెలరేగింది. విమర్శలు రావడంతో మెటా వెంటనే ఆ పోస్టును పునరుద్ధరించింది.ఇటీవల పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరైన మెటా ప్రతినిధులు, ఇది సాంకేతిక లోపం వల్ల జరిగిందని క్షమాపణ చెప్పారు. అయితే ఐటీ శాఖ ఆ వివరణను పూర్తిగా అంగీకరించలేదు. నిజంగా సాంకేతిక లోపమే అయితే అలాంటి సమస్యలు మళ్లీ రాకుండా మెటా తన వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన అసభ్యకర కంటెంట్ ప్రకటనల రూపంలో కనిపిస్తున్న వ్యవహారంపైనా మెటాపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నోటీసు ఇచ్చింది. ఈ అంశంపై పార్లమెంటరీ కమిటీ మరోసారి హెచ్చరిక జారీ చేసింది.గూగుల్, యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ సహా అన్ని సోషల్ మీడియా వేదికలు చిన్నారులపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్‌ను కట్టడి చేసే నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కమిటీ స్పష్టం చేసింది. ఉల్లంఘనలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## కోస్తాంధ్రకు గర్వకారణం

అనంతరం, పీవీ సింధు, క్రీడాశాఖ మంత్రితో కలిసి లోకేశ్ శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి, నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం అకాడమీ భవన నమూనాను, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురానున్న అత్యాధునిక సౌకర్యాలను మంత్రి లోకేశ్ ఆసక్తిగా పరిశీలించారు. అకాడమీ లక్ష్యాలు, వసతుల గురించి సింధును అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టుపై రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ) ప్రజెంటేషన్‌ను వీక్షించారు చిన్నతనం నుంచి తాను సాగించిన క్రీడా ప్రయాణం, కోచ్‌లు అందించిన ప్రోత్సాహం, ఎదురైన సవాళ్లను మనసులో ఉంచుకుని ఈ కేంద్రానికి సింధు శ్రీకారం చుట్టారు. ఈ అకాడమీ శంకుస్థాపన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖలోని తోటగురువు ప్రాంతంలో "పీవీ సింధు సెంటర్ ఆఫ్ బ్యాడ్మింటన్ ఎక్సలెన్స్ అకాడమీ" కి మంత్రి నారాలోకేష్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పీవీ సింధు దంపతులతో పాటు మంత్రి రాంప్రసాద్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ అకాడమీ కేవలం బ్యాడ్మింటన్ కేటాయింపులకే పరిమితం కాకుండా బహుళ క్రీడల శిక్షణా కేంద్రంగా అలరారనుంది. ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించే అధునాతన బ్యాడ్మింటన్ కోర్టులు అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు హై పెర్ఫార్మెన్స్ కోచింగ్ సదుపాయాలు, ఫిట్‌నెస్ కోసం ప్రత్యేక స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ సెంటర్, స్పోర్ట్స్ సైన్స్ విభాగాలు ఏర్పాటు కానున్నాయి. క్రీడాకారులకు తక్షణ వైద్య సేవలు అందించే ఫిజియోథెరపీ యూనిట్లు, అథ్లెట్లకు అవసరమైన పౌష్టికాహార మద్దతు, రికవరీ సపోర్ట్ వంటి అత్యాధునిక వసతులను ఇక్కడ కల్పిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యువ క్రీడాకారుల కోసం బస సదుపాయాలు కూడా కాంపస్ లోపలే సిద్ధం కానున్నాయి. ప్రపంచ వేదికలపై భారత పతాకాన్ని ఎగురవేసే దిశగా ఇక్కడి క్రీడాకారులకు ఆధునిక సాంకేతికతతో కూడిన శిక్షణ ఇవ్వనున్నారు.ఈ అకాడమీ స్థాపన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అద్భుతమైన క్రీడా ప్రతిభను వెలికితీయడమే. ఆర్థిక స్థోమత లేక, సరైన శిక్షణ లభించక వెనుకబడిపోతున్న ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించాలని సింధు సంకల్పించారు. క్రీడా రంగంలో స్థిరపడాలనుకునే యువతకు అన్ని రకాల వసతులు ఒకే చోట లభించేలా ఈ కాంపస్ రూపుదిద్దుకుంటోంది. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన క్రీడా కేంద్రాల్లో ఒకటిగా దీనిని తీర్చిదిద్దేందుకు సింధు బృందం శ్రమిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే కాకుండా, క్రీడలను ఒక కెరీర్‌గా ఎంచుకునేలా నూతన తరాన్ని ప్రేరేపించడం ఈ కేంద్రం ప్రధాన ధ్యేయం. విశాఖపట్నంలో ఇటువంటి అకాడమీ రావడం ద్వారా ఈ ప్రాంతం దక్షిణ భారతదేశంలోనే ఒక ప్రముఖ స్పోర్ట్స్ హబ్‌గా మారబోతోంది.ఒలింపిక్స్‌లో రజత, కాంస్య పతకాలు సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన పీవీ సింధు, తన ఆలోచనలను ఆచరణలో పెడుతూ క్రీడాభివృద్ధికి పూనుకోవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. క్రీడాకారిణిగా శిఖరాగ్రాన నిలిచిన కాలంలోనే సమాజానికి, క్రీడారంగానికి తిరిగి ఇవ్వాలనే ఆమె ఆలోచన ఎంతోమందికి ప్రేరణగా నిలుస్తోంది. విశాఖ నగరంలో రూపుదిద్దుకోనున్న ఈ అకాడమీ ద్వారా రాబోయే రోజుల్లో వందలాది మంది కొత్త ఛాంపియన్లు పుట్టుకొస్తారని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సహకారంతో ఈ ప్రాజెక్టు శరవేగంగా పూర్తయి అందుబాటులోకి రానుంది. ఈ చారిత్రాత్మక ఘట్టం తెలుగు రాష్ట్రాల్లో క్రీడా రంగానికి కొత్త ఊపిరి పోస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## డయల్ 112 ఇక ఇదే..

రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, యువతులపై వేధింపుల వంటి అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే వెంటనే రియాక్ట్ అయి నిముషాల వ్యవధిలోనే స్థానిక పోలీసులు అక్కడకు చేరేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించినట్లు డీజీపీ వెల్లడించారు. ఈ నేపథ్యంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిత్యం కాల్స్ లను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ వచ్చిన వెంటనే కాలర్ వివరాలు, లొకేషన్‌ను గుర్తించి సమీప పోలీస్ స్టేషన్, ఫైర్ సిబ్బంది, అవసరమైన బృందాలకు సమాచారం అందిస్తారు. దీంతో సిబ్బంది నిముషాల వ్యవధిలోనే అక్కడకు చేరుకుంటారు. డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. భవిష్యత్తులో ఏఐతో కూడా దీన్ని అనుసంధానించి ఉపయోగించుకోనేలా చర్యలు చేపట్టారు.

## ఎమ్మెల్యే అయిన ఏడాదిన్నరలోనే అప్పుల కొండను ఎలా కరిగించారు?

- కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఖాతాల వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటి?
- బిజెపి రాష్ట ఉపాధ్యక్షుడు వెర్రబెల్లి


✍ జయభేరి, హైదరాబాద్ :



2023 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మొత్తం ఆస్తులు 54 కోట్లు, అప్పులు 12 కోట్లు, వార్షిక ఆదాయం కేవలం 34 లక్షలు. పైగా ఐటీ శాఖకు కట్టాల్సిన బకాయిలే 1.85 కోట్లు ఉన్నాయి. పదేళ్లుగా బ్యాంకుల దగ్గర డిఫాల్టర్‌గా ఉండి ఎన్సీఎల్టీలో కేసులు ఎదుర్కొంటున్న వ్యక్తి, కేవలం 16 నెలల వ్యవధిలోనే 9 బ్యాంకులకు ఏకంగా 470 కోట్ల అప్పులు ఎలా చెల్లించారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ రావు ప్రశ్నించారు. తన రియల్ ఎస్టేట్ కంపెనీకి సంబంధించిన 357 కోట్లు, హోటల్ వ్యాపారానికి సంబంధించిన 87 కోట్లను ఏ విధంగా క్లియర్ చేశారు? బంజారాహిల్స్ లోని ఒక్క బ్యాంకుకే ఒకేసారి 120 కోట్లు చెల్లించి ఎన్ఓసీ ఎలా తెచ్చుకోగలిగారని అయన నిలదీసారు. దీనిపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి. ఈ వ్యవహారం వెనుక ఉన్న మంత్రి ఎవరు? మొన్న మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు మంచిర్యాలలో రాత్రి బస చేసి తేల్చిన లెక్కలు ఇవేనా? ఈ 470 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేసారు.

# బతుకే ఒక పోరాటం
# 'సమసమాజ స్వాప్నిక వేగుచుక్క' గద్దర్

✍ జయభేరి, హైదరాబాద్ :



గద్దర్ అనే మారుపేరుతో ప్రాచుర్యం పొందిన 'గుమ్మడి విఠల్ రావు' అనే ఒక సామాన్యమైన మానవుడు మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలోని అంటరాని దళిత కుటుంబంలో గుమ్మడి లచ్చుమమ్మ, గుమ్మడి శేషయ్య అనే దంపతులకు 1948, జనవరి 31 నాడు జన్మించారు. విఠల్ ఆరోయేట వచ్చే వరకు మట్టి వాసనలు గుబాళించే పల్లె పదాలు, జానపద పాటలు బాగా పాడే తల్లి లచ్చుమమ్మని చూసి జానపద బాణీలను బాగా అనుకరించారు. అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ పోరాటాలతో తండ్రి శేషయ్య తీవ్రంగా ప్రభావితులైన తీరు విఠల్ ని ఎంతగానో ఆకర్షింపజేసింది. విఠల్ పాఠశాల జీవితం 'బతుకే ఒక పోరాటం' అనే విధంగా సాగింది.

తూప్రాన్ తాలుకాలో హెచ్.ఎస్.సి పాసైన తొలి దళిత విద్యార్థిగా విఠల్ పేరు పొందారు. తర్వాత సైఫాబాద్ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో పి.యు.సి (ఎం.పి.సి)లో 77 శాతం మార్కులతో డిస్టింక్షన్ ని సాధించారు. 1968లో ఉస్మానియా ఇంజినీరింగ్ కాలేజ్ లో సీటు సాధించి సరికొత్త చరిత్రని సృష్టించారు. అయితే ఆర్థికపరమైన సమస్యల కారణంగా ఆయన ఆ ఇంజనీరింగ్ కోర్స్ ని మధ్యలోనే వదిలేసి ప్రభుత్వ క్షేత్ర ప్రచార శాఖలో 'కుటుంబ నియంత్రణ పథకం'లో భాగంగా బుర్రకథలు చెప్పారు. అలా ప్రభుత్వం 75 రూపాయలు ఇస్తే బుర్రకథ దళ సభ్యులందరూ సమానంగా పంచుకునేవారు. వందలాది సార్లు చెప్పిన అంబేద్కర్ బుర్రకథ, అల్లూరి సీతా రామరాజు బుర్రకథలు విఠల్ భావాలకు దారి చూపాయి.

ఈ క్రమంలోనే ఆయనకి 'ఆర్ట్స్ లవర్స్' అనే ప్రగతిశీల సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు బి.నరసింగరావు కళా సాన్నిహిత్యం లభించడంతో ఆయన 1970 లో ఆ ఆర్ట్ లవర్స్ సంస్థలో చేరారు. ఆ ఆర్ట్ లవర్స్ లో ఒక సందర్భంలో వచ్చిన కళ ఎవరి కోసం ? అనే చర్చ ఫలితంగా 'కళ ప్రజల కోసం' అనే అంతిమ సమాధానం విఠల్ ని ఎంతగానో ప్రభావితం చేసింది. 'ప్రజలను జాగృతం చేసే కళకు అంకితమవ్వాలి' అని నిర్దేశించుకున్న విఠల్ తన పాటల బాణీలను ప్రజల కోసం రూపొందించాడు. క్రమంగా గుమ్మడి విఠల్ 'గద్దర్'గా పరిణామం చెందారు.

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు నిర్వహిస్తున్న సమ సమాజ పోరాటాలు, ఉస్మానియా విశ్వవిద్యాలయం లో జరుగుతున్న అభ్యుదయ ఉద్యమాలు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చైతన్యం, చైనాలో జరుగుతున్న సాంస్కృతిక విప్లవం చైతన్యం, జాతీయంగాను, అంతర్జాతీయంగాను సోషలిస్ట్ శిబిరాలు ఏర్పడడం మొదలైన సంఘటనలు అన్ని గద్దర్ ని విప్లవోద్యమం వైపు పయనింపజేయడానికి దోహదపడ్డాయి. నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాలు లవర్స్ సంస్థని క్రమంగా 'జనానాట్యమండలి'గా రూపొందించాయి. అలా జనానాట్యమండలి వెలుగులో గద్దర్ అంబేద్కరిజం నుండి క్రమంగా 'మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానం' దిశగా పరివర్తన చెందారు. అలా గద్దర్ 1973 నుండి పాటలు రాస్తూ జననాట్యమండలికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

గద్దర్ 1975లో సికింద్రాబాద్ లోని వెస్ట్ మారేడుపల్లిలో గల కెనరా బ్యాంక్ లో ఉద్యోగంలో చేరి 1992 లో అప్పటి పీపుల్స్ వార్ పార్టీ నిర్ణయం మేరకు ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తికాలపు జనానాట్య మండలి సభ్యుడిగా కొనసాగారు. 198589 వరకు పూర్తిగా ఆట పాట మాట బంద్ కావడంతో జననాట్య మండలి బహిరంగంగా పనిచేయని విషమ పరిస్థితులు తలెత్తడంతో గద్దర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. 1990, ఫిబ్రవరి 18వ తేదీన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంతో గద్దర్ తిరిగి బహిరంగ జీవితంలోకి ప్రవేశించారు. పీపుల్స్ వార్ పార్టీ 1995లో గద్దర్ ని పార్టీ నుండి బహిష్కరించింది. కాని తర్వాతి క్రమంలో పార్టీ ముందుకు పోవడంలో గొప్ప పాత్ర వహించి అవగాహనను సవరించుకొని తాను ఆలోచనా విధానాన్ని మార్చుకున్నానని ఆయన పేర్కొనడంతో పీపుల్స్ వార్ పార్టీ ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకుంది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 1995లో ఊపందుకోవడంతో గద్దర్ తెలంగాణ రాష్ట్ర సాధన ఆవశ్యకతను తెలియజేస్తూ పాలకుల దోపిడీ, దౌర్జన్యాలను, అణచివేతలు, తెలంగాణ వనరులు మొదలైన వాటి గురించి పాటలు రాసి పాడారు. అన్ని మార్క్సిస్ట్ లెనినిస్ట్ పార్టీలు తెలంగాణను వ్యతిరేకించినప్పుడు ఒకే ఒక్క పీపుల్స్ వార్ పార్టీ తెలంగాణను సమర్థించినప్పుడు ఆయన ఆ పీపుల్స్ వార్ పార్టీ వాయిస్ ద్వారా 'ప్రత్యేక తెలంగాణ' ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. మృతదేహాల స్వాధీన కమిటీ కన్వీనర్ గద్దర్ బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో ఒక దశలో 'పాడెపై పడుకొని మృతదేహాలను అప్పగించేదాకా కదిలేది లేదు' అని పేర్కొనడం గమనార్హం. 'ఎన్ కౌంటర్లు అన్నీ రాజకీయ హత్య'లే అనే స్థాయికి గద్దర్ ని నాదాన్ని ముందుకు తీసుకెళ్లారు. అమరవీరుల బంధుమిత్రుల కమిటీ లేని కాలంలో గద్దర్ అమరవీరుల కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచారు. న్యాయవాదులు కోర్టులలో పోరాటం చేస్తే గద్దర్ బూటకపు ఎన్ కౌంటర్ లకు వ్యతిరేకంగా ఉద్యమించి విజయం సాధించారు. అగంతకులు 1997, ఏప్రిల్ 6 నాడు గద్దర్ పై కాల్పులు జరపడంతో ఆయన తృటిలో తప్పించుకొని మృత్యువుని జయించి తనపై జరిగిన దాడికి ఏమాత్రం వెనుకంజ వేయకుండా విప్లవోద్యమంలో మరింతగా మమేకమై ముందుకు సాగారు. 1998లో అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా గద్దర్ ఎన్నుకోబడ్డారు.



✍ జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్, సెల్: 94933 19690

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నక్సలైట్ పార్టీల మధ్య జరిగిన శాంతి చర్చలలో గద్దర్ తనవంతు పాత్రని నిర్వహించారు. 2004 చివరి నుండి గద్దర్ తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో మమేకమై 'ధూమ్ ధామ్'కి గైడెన్స్ అందించారు. 2007 లో గద్దర్ గౌరవ అధ్యక్షులుగా 'తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య' ఆవిర్భవించింది. 2007, ఫిబ్రవరి 2 నాడు గద్దర్ హైదరాబాద్ లోని అసెంబ్లీ అమరవీరుల స్మారక స్థూపం నుండి 'శాంతియాత్ర'ని ప్రారంభించి రాజకీయ నాయకుల శాంతి యాత్రల కన్నా భిన్నంగా అన్ని వర్గాల ప్రజలను ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఒకే వేదిక మీదికి తీసుకురావడంలో ఆయన సఫలీకృతం అయ్యారు. కుల పోరాటం వర్గ పోరాటంలో భాగం అని విశ్వసించి మార్క్సిస్ట్ లెనినిస్ట్ మావో సిద్ధాంతాల తాత్విక దృక్కోణాలతో పురోగమించిన గద్దర్ తాను చైర్మన్ గాను 2010, అక్టోబర్ 9 నాడు హైదరాబాద్ లో 'తెలంగాణ ప్రజా ఫ్రంట్' ఆవిర్భవించింది. ఆ తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆవిర్భావం నాడే 'ఉద్యమాలు కాదు. ఎన్నికలు కూడా ఉండాలి' అని పేర్కొంటూ ఒక విప్లవ పార్టీ ఫ్రంట్ ని చీల్చాలి అని కుట్ర చేసిననూ గద్దర్ వాటన్నింటినీ సమర్థవంతంగా ఎదుర్కొని ముందుకు సాగారు. 'ఉద్యమాల ద్వారానే తెలంగాణ వస్తుంది' అనే గీటురాయికి ఆయన నాయకత్వం వహించి మొత్తం నక్సలైట్ ఉద్యమంలో తిరిగిన దానికంటే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కొన్ని లక్షల కిలోమీటర్లు తిరిగి ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను చైతన్యవంతులను చేశారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక గద్దర్ సామాజిక తెలంగాణ సాధన కోసం ఉద్యమించారు. కాలక్రమంలో ఆయన ప్రజాస్వామ్య బాటలో అడుగులు వేసి ఓటు హక్కుని నమోదు చేసుకున్నారు. ఆయన రాజకీయ పార్టీ స్థాపనలో భాగంగా రిజిస్ట్రేషన్ కోసం ఎన్నికల కమీషన్ కి దరఖాస్తుని సమర్పించారు. తదనాంతర కాలంలో ఆయన ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చేరి 2023 ఆగస్టు 6 నాడు అమరుడు కావడం విషాదకరం. ఆయన మరణం సాహిత్య, సాంస్కృతిక రంగాలకు మరియు పీడిత ప్రజానీకానికి తీరని లోటుని కలిగిస్తూనే ఉంది. నేడు గద్దర్ భౌతికంగా లేకున్ననూ ఆయన తన పాటల ద్వారా ప్రతినిత్యం పల్లవిస్తూనే ఉన్నారు. 'బతుకే ఒక పోరాటం' అని నినదించి సమసమాజ స్థాపన కోసం అనుక్షణం ఉద్యమించిన గద్దర్ అశేష జనం గుండె చప్పుళ్లలో ప్రతిధ్వనిస్తూ 'సమసమాజ స్వాప్నిక వేగుచుక్క'గా ప్రభవిస్తూనే ఉంటారు.

(ఆగస్టు 6 గద్దర్ మూడవ వర్ధంతి)



## ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- యాదగిరిగుట్ట సీఐ బాస్కర్

✍ జయభేరి, యాదగిరిగుట్ట, ఆగస్టు 05 :

రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ సూచించారు. బుధవారం యాదగిరిగుట్ట మండలంలోని మర్రిగూడెం గ్రామంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ పై సీఐ అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లో నిర్లక్ష్యం, అతివేగం,మద్యం సేవించి వాహనం నడపడం,మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని,డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సూచికలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణయించిన వేగ పరిమితిని మించకుండా వాహనాలు నడపాలని తెలిపారు. అంబులెన్స్,అగ్నిమాపక, అత్యవసర సేవల వాహనాలకు వెంటనే దారి ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై ఖాజా మొయినుద్దీన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం సమంజసం కాదు



✍ జయభేరి, దేవరకద్ర :

రైల్వే అధికారులు రైతులకు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరించడం ఏమాత్రం సమంజసం కాదని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల రైతువేదికలో ఇటీవల పుట్టపల్లి, వెంకటగిరి గ్రామాల రైతుల భూముల్లో ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రైల్వే అధికారులు హద్దురాళ్ళు పాతిన ఘటనపై బుధవారం ఎమ్మెల్యే జీఎంఆర్ ఆర్డిఓ, రైల్వే అధికారులు, సంబంధిత గ్రామాల రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల ఆందోళనలు, అభ్యంతరాలను ఎమ్మెల్యే జిఎంఆర్ స్వయంగా విన్నారు. రైతుల హక్కులకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని ఎమ్మెల్యే జిఎంఆర్ స్పష్టం చేశారు. ఈ అంశాన్ని వెంటనే రైల్వే జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి రైతుల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం జరగకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని రైతులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో పాలమూరు ప్రతిభ

- హన్వాడ మండలానికి చెందిన క్రీడాకారుడు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం




✍ జయభేరి, దేవరకద్ర :

పాలమూరు జిల్లాకు చెందిన ముద్దుబిడ్డ అంతర్జాతీయ స్థాయిలో మరోసారి మెరిశాడు. మహబూబ్ నగర్ జిల్లా హన్వాడ మండలానికి చెందిన ఓ క్రీడాకారుడు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన స్థాయి నుంచి ఏకంగా భారత జట్టుకే కోచ్ గా వ్యవహరించి అరుదైన గౌరవాన్ని సంపాదించాడు. దీంతో తాను పుట్టిన హన్వాడ మండలం ప్రాంతానికే గర్వకారణంగాను నిలిచాడు. ఈనెల 15 నుంచి హాంకాంగ్ లో జరుగునున్న 14వ ఆసియా ఉమెన్స్ నెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనే భారత మహిళల నెట్ బాల్ జట్టు కోచ్ గా హన్వాడ మండలం పుల్పోనిపల్లి గ్రామానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు విక్రమాదిత్య రెడ్డి నియమితులయ్యారు. హన్వాడ మండలం మాజీ జడ్పిటిసి సభ్యుడు బోదం నరేందర్ కుమారుడు గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి, కష్టపడి పైకి ఎదిగి భారత జట్టుకు కోచ్ గా ఎంపిక కావడం పట్ల ఆయనను గ్రామస్తులు, క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తపరుస్తున్నారు. విక్రమాదిత్య రెడ్డి నాయకత్వంలో భారత ఉమెన్స్ నేపాల్ జట్టు ఆసియా చాంపియన్ షిప్ అత్యుత్తమ ప్రదర్శన కనపరిచి, దేశానికి పథకాలు సాధించి తీసుకురావాలని ఆయన గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా విక్రమాదిత్య రెడ్డికి గ్రామ సర్పంచ్ వల్లల్లి భాగ్యలక్ష్మి రాకమయ్య, గ్రామ ప్రముఖులు, మండల ప్రజా ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## లిఫ్ట్ ప్రమాదంలో మహిళ మృతి

✍ జయభేరి, రంగారెడ్డి :

చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లిఫ్ట్ లో ప్రమాదంలో మహిళ మృతి చెందింది. చందానగర్ అన్నపూర్ణ ఎన్ క్లేవ్ లోని అపార్ట్మెంట్ లిఫ్ట్ లో మహిళ ఎక్కింది. లిఫ్ట్ లోకి అడుగు పెట్టగానే లిఫ్ట్ కదిలింది. దీంతో కాళ్లు ఇరుక్కోని మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమెను వెంటనే స్థానికులు హస్పటల్ కు తరలించారు. అప్పటికే మహిళ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## పరీక్ష ఫీజుల పేరుతో నిరుద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వం భారం మోపుతోంది

- బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ

✍ జయభేరి, దేవరకొండ :

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు ఎలాంటి పరీక్ష ఫీజులు వసూలు చేయబోమని హామీ ఇచ్చిందని, కానీ ప్రస్తుతం ఆ హామీని విస్మరించి ఎస్సై పోస్టుకు రూ.1,500, కానిస్టేబుల్ పోస్టుకు రూ.1,000 చొప్పున పరీక్ష ఫీజులు వసూలు చేస్తోందని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటికే నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, ఇలాంటి భారీ పరీక్ష ఫీజులు విధించడం వారికి అదనపు ఆర్థిక భారం మోపడమేనని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విద్యార్థులు, నిరుద్యోగులతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యాపారం చేస్తున్నట్లు కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే పరీక్ష ఫీజులను రద్దు చేయాలని లేదా గణనీయంగా తగ్గించాలని, ఎన్నికల హామీలను అమలు చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు.

# యాదగిరీశుడికి నిత్యపూజల వైభవం

✍ జయభేరి, యాదగిరిగుట్ట :



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



### శ్రీనారసింహుడి నిత్యరాబడి..

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా బుధవారం రూ.9,81,898 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.75,050, బ్రేక్ దర్శనం ద్వారా రూ.90,600, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.27,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,10,700, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.1,97,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.21,400, ప్రసాద విక్రయం ద్వారా రూ.3,61,130, కల్యాణకట్ట ద్వారా రూ.19,400తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## ఫిలింనగర్ లో బోనాల పండుగ



ఫిలింనగర్ లో బోనాల పండుగ సందర్భంగా ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఎమ్మార్పీఎస్ ఫిలింనగర్ డివిజన్ అధ్యక్షుడు బొప్పారం వేణుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, టిపిసిసి కార్యదర్శి విజయ రెడ్డి, మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు డబ్బు చప్పుళ్ల మధ్య అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.

# దేవరకద్రం మండల సర్వసభ్య సమావేశం

- సంక్షేమ పథకాల ప్రచారం కల్పించాల్సిన బాధ్యత అధికారులు, సర్పంచుల పై ఉంది
- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి




జయభేరి, దేవరకద్ర :

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిన బాధ్యత అధికారులు మరియు సర్పంచులపై ఎంతైనా ఉందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సూచించారు. దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం దేవరకద్ర మండలం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పాల్గొని అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షించారు.ఈ సందర్భంగా రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, పశుసంవర్ధక, ఆర్అండ్‌బీ, ఉద్యానవన, ఇరిగేషన్, ఫారెస్ట్, వెటర్నరీ తదితర శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని ఎమ్మెల్యేకి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యానికి తావు లేకుండా జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, రెవెన్యూ శాఖ భూ సమస్యలు, ప్రజల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో అడ్మిషన్లు పెరిగాయని పేర్కొంటూ విద్యా రంగంపై ప్రత్యేక శ్రద్ధ కొనసాగుతుందని తెలిపారు.ఉపాధి హామీ పథకం కింద కొత్త పనులపై సర్పంచులకు అవగాహన కల్పించి, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు.నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, రాబోయే సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు త్వరలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ స్విచ్‌లు, విద్యుత్ పోల్స్ పంపిణీ కార్యక్రమాలను త్వరలో మండలాల వారీగా చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, పశువైద్య సేవలను గ్రామ స్థాయిలో మరింత సమర్థవంతంగా అందించాలని చెప్పారు.గ్రామాలు, మండల కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రోడ్లు, భవనాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించి రైతులకు అవగాహన కల్పించాలని హార్టికల్చర్ శాఖ అధికారులకు సూచించారు.విద్య, వైద్యం, ఇరిగేషన్ వంటి కీలక రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని పేర్కొంటూ, అధికారులు తమ శాఖలకు సంబంధించి, వాట్సప్ గ్రూపులు క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు సర్పంచులకు సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిన బాధ్యత అధికారులు, సర్పంచులపై ఉందని తెలియజేశారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను వెంటనే అందజేయాలని ఈ సందర్భంగా సర్పంచులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తురుక కాశి కమ్యూనిటీకి చెందిన లబ్ధిదారులకు జనరేటర్లు, పనిముట్ల ను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జియంఆర్. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## చెరువును ప్రజలకు ఆహ్లాదకరమైన విహార ప్రదేశం

- కాప్రా చెరువులో హైడ్రా ఆధ్వర్యంలో కొనసాగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జయభేరి, కాప్రా :

ఉప్పల్ నియోజకవర్గంలోని కాప్రా చెరువులో హైడ్రా ఆధ్వర్యంలో కొనసాగుతున్న సుందరీకరణ, అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాలనీ వాసులు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు చుట్టూ చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువును ప్రజలకు ఆహ్లాదకరమైన విహార ప్రదేశంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చెరువు అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వాతావరణం, వాకింగ్ ట్రాక్, పచ్చదనం, విశ్రాంతి కోసం అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. స్థానికులు చెరువు అభివృద్ధిపై తమ అభిప్రాయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కాప్రా చెరువును నియోజకవర్గానికి ఆదర్శవంతమైన పర్యావరణ, వినోద కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు నవీన్ గౌడ్ BRS పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం కావాలి



జయభేరి, చింతపల్లి :

గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం కావాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....మహిళా సంఘాల బలోపేతం, స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగం, మహిళల ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు.మహిళా సంఘాలు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.ప్రభుత్వం అందిస్తున్న రుణాలు,ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆమె సూచించారు.గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని, మహిళా సంఘాల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు,ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి,గ్రామ వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, రెడ్డి పద్మ పరమేష్,మర్ల యాదగిరి,శివర్ల పర్వతాలు యాదవ్,మహిళా సంఘాల సి.సి రమేష్,గ్రామ కార్యదర్శి కిరణ్ కుమార్,పెద్దలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 18 శాతానికి తగ్గిన వర్షపాతం లోటు

- తెలంగాణకు ఎల్లో అలర్ట్




జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 5 :

గత వారం రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో హైదరాబాద్ నగరానికి గణనీయమైన ఊరట లభించింది. వారం క్రితం 34 శాతంగా ఉన్న వర్షపాత లోటు ప్రస్తుతం 18 శాతానికి తగ్గింది. ప్రస్తుత రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణంగా 297.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 245 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.అయితే, నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షపాతం ఒకే రీతిలో లేదు. తిరుమలగిరిలో 45 శాతం, సైదాబాద్‌లో 35 శాతం, మారేడ్‌పల్లిలో 31 శాతం, అంబర్‌పేటలో 27 శాతం, నాంపల్లి, చార్మినార్‌లలో 26 శాతం చొప్పున అత్యధిక లోటు నమోదైంది. మరోవైపు, గోల్కొండలో సాధారణం కంటే 19 శాతం, బహదూర్‌పురాలో 5 శాతం అధిక వర్షపాతం నమోదైంది. షేక్‌పేట, అమీర్‌పేట, ముషీరాబాద్, ఆసిఫ్‌నగర్ వంటి ప్రాంతాల్లో వర్షపాతం సాధారణ స్థాయికి చేరువలో ఉంది.ఇదిలా ఉండగా, రానున్న ఏడు రోజుల పాటు తెలంగాణవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆగస్టు 10 వరకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. ఈ వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని, ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాల ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అంచనా వేసింది.

# రెండో విడతలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

- గౌరాయపల్లి గ్రామంలో మార్నింగ వాక్‌లో ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



జయభేరి, యాదగిరిగుట్ట :

యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయిపల్లి గ్రామంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి గౌరాయపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా బుధవారం యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. గౌరాయపల్లి గ్రామంలో మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరిస్తూ వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు.

నాణ్యతతో పాటు నిర్ణీత గడువులోపు ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండవ విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఆలేరు నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు సమష్టిగా పనిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఆలేరు నియోజకవర్గానికి ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని,ప్రతి అర్హత కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలోని చెరువులను నీటితో నింపేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని,గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని,గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కోసం అవసరమైన రహదారులు, తాగునీటి సౌకర్యం,మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని తెలిపారు. గ్రామ చేనేత సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, చేనేత కార్మికుల సంక్షేమానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరాయపల్లి గ్రామ సర్పంచ్ కేసిరెడ్డి శోభరవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ బింగి లక్ష్మిపతి, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు ,కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



## చిటారమ్మ ఆలయం సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

జయభేరి, మేడిపల్లి :

మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ బోడుప్పల్ డివిజన్ పరిధిలోని చిటారమ్మ ఆలయం సమీపంలో రూ.18 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను, రానున్న బోనాల మహోత్సవాల నేపథ్యంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు పొగుల దిలీప్ రెడ్డి, బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక నాయకులు జెనిగె వెంకటేష్, ఉప్పరి అనిల్, పక్కా రాజు, కొత్త రఘు, అలాగే స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోనాల పండుగకు ముందే సీసీ రోడ్డు పనులను పూర్తి చేసి భక్తులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు.

## అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచేసుకోవాలి

- SIR ప్రక్రియపై మేడిపల్లి మండల ఎంఆర్ఓతో సమీక్ష నిర్వహించిన తుంగతుర్తి రవి



జయభేరి, మేడిపల్లి :

మేడిపల్లి మండల ఎంఆర్ఓని వారి కార్యాలయంలో మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి కలిసి, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో SIR ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యల గురించి వివరాలు తెలుసుకున్నారు. అలాగే అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సరిచేసుకుని, అవసరమైన దరఖాస్తులను సకాలంలో పూర్తి చేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని తుంగతుర్తి రవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బండిరాళ్ల భాస్కర్, జోగు సోమయ్య, తీగల రంగన్న గౌడ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# గోవిందాహలీ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక


- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశాల మేరకు కమిటీ ఏర్పాటు
- హాజరైన ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మదనపురం మండలం గోవిందాహలీ గ్రామంలో బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ సోదరుడు భాస్కర్ రెడ్డి మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనుంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సోదరుడు జి. భాస్కర్ రెడ్డి హాజరై గ్రామ కాంగ్రెస్ శ్రేణుల సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ కమిటీ సభ్యులు పార్టీ పట్టిష్టతకు పాటుపడాలని సూచించారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కమిటీ సభ్యులపై ఎంతైనా ఉందన్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడిగా అధ్యక్షులు చుక్క ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా జి. రమేష్, రామకృష్ణ ప్రధాన కార్యదర్శి పి. హర్షవర్ధన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వి.కె. శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు ఘనంగా అభినందనలు తెలిపారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## డివిజన్ అధ్యక్షులకు శుభాకాంక్షలు



జయభేరి, మేడిపల్లి :

తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి, నూతనంగా నియమితులైన బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు పొగుల దిలీప్ రెడ్డిని మంత్రికి పరిచయం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డివిజన్ అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలియజేసి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ జనరల్ సెక్రటరీ కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## శుభకార్యాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని..

- బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి శుభకార్యాలకు ఆహ్వానించిన నాయకులు

జయభేరి, కుత్బుల్లాపూర్ :

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, పలు శుభకార్యాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి వారి ఆహ్వానాన్ని స్వీకరించి, శుభకార్యాలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా కళాశాలలో ఓరియెంటేషన్ డే

- విద్యార్థులు 'జాబ్ సీకర్స్' కాదు.. 'జాబ్ క్రియేటర్స్'గా ఎదగాలి : ప్రొ. అల్లం శ్రీనివాసరావు
- విద్యార్థులు నైపుణ్యాలపై దృష్టి సారించి భవిష్యత్తును నిర్మించుకోవాలి: త్రిశూల్ రెడ్డి



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా మైసమ్మగూడాలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాస్ రావు అతిథిగా హాజరుకాగా, క్యాప్‌జెమినీ సీనియర్ మేనేజర్ అంకుర్ మిట్టల్, సోషల్ గవర్నెన్స్ అడ్వైజర్, POSH పాలసీ నిపుణురాలు రోహిణి నాయుడు, వి యాక్సిస్ లెర్నింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సీఈఓ వికాస్ సురేంద్రన్, మైక్రోసాఫ్ట్ సీనియర్ టెక్నికల్ కన్సల్టెంట్ రజిని కాసల, ఇంటర్నేషనల్ ఆర్ట్ ఆఫ్ లివింగ్ ట్రైనర్ పారుల్ ఖురానా, పోలీస్ శాఖకు చెందిన మోటివేషనల్ స్పీకర్ డి.జి. రామ్మూర్తి, గ్రాడ్‌స్ట్రీట్ సీఈఓ కె. దుర్గ నవీన్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రొఫెసర్ అల్లం శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూసే "జాబ్ సీకర్స్"గా కాకుండా, పదిమందికి ఉపాధి కల్పించే "జాబ్ క్రియేటర్స్"గా ఎదగాలని సూచించారు. ఇందుకోసం విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్), ప్లేస్‌మెంట్ అవకాశాలపై దృష్టిసారించడంతో పాటు వినూత్న ఆలోచనలను (ఇన్నోవేషన్ థాట్ ప్రాసెస్) పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అత్యాధునిక ప్రయోగశాలలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కళాశాల నుంచి ఇంజనీరింగ్ పట్టా పొందిన విద్యార్థులకు ఉన్నత ఉద్యోగ అవకాశాలతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డా. ఎ. మోహన్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించగా, ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకానాథం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నైతిక విలువలను అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జె. నర్సింహారెడ్డి, కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి, కోశాధికారి జె. త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా. ఎ. మోహన్, ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకానాథం, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, నూతన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## విద్యార్థులు నైపుణ్యాలపై దృష్టి సారించి భవిష్యత్తును నిర్మించుకోవాలి: త్రిశూల్ రెడ్డి

మైసమ్మగూడాలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఓరియెంటేషన్ డే కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. బీటెక్‌లో కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి జీవితంలో కొత్త ప్రయాణానికి నాంది పలుకుతున్న ఈ ఓరియెంటేషన్ కార్యక్రమానికి కళాశాల తరఫున స్వాగతం పలికారు. ఇంజనీరింగ్ అనేది కేవలం డిగ్రీ పొందేందుకు మాత్రమే కాదని, విజ్ఞానం, నైపుణ్యాలు, సృజనాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత వైఖరిని పెంపొందించుకునే గొప్ప అవకాశమని తెలిపారు. ఇంజనీరింగ్ నాలుగేళ్లలో నేర్చుకునే ప్రతి అంశం విద్యార్థుల జీవితాన్ని మార్చగలదని వారు తీసుకునే సరైన నిర్ణయాలే విజయానికి బలమైన పునాది అవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ముందంజలో నిలవాలంటే కృత్రిమ మేధస్సు (ఏఐ), డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ వంటి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులు కూడా తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. కేవలం మార్కులు ఉద్యోగ అవకాశాలను కల్పించగలవని, అయితే విద్యార్థులు సంపాదించుకునే నైపుణ్యాలే జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని త్రిశూల్ రెడ్డి అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అత్యాధునిక ప్రయోగశాలలు, పరిశ్రమలతో అనుసంధానమైన శిక్షణ, సమర్థవంతమైన ప్లేస్‌మెంట్ సపోర్ట్ అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకొని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలని, సమయాన్ని గౌరవిస్తూ తల్లిదండ్రులు, అధ్యాపకులు గర్వపడేలా ఎదగాలని విద్యార్థులకు త్రిశూల్ రెడ్డి పిలుపునిచ్చారు.




## టెల్లాపూర్ పాఠశాలలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన కార్యక్రమం

**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 05 :**

ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, ఐఎఫ్‌హెచ్‌ఈ, హైదరాబాద్‌కు చెందిన లీగల్ ఎయిడ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రామచంద్రాపురం మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టెల్లాపూర్‌లో పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించే పోక్సో చట్టం-2012పై న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో అధ్యాపకులు పోక్సో చట్టం లక్ష్యాలు, బాలల హక్కులు, వ్యక్తిగత భద్రత, అనుచిత ప్రవర్తనను గుర్తించే విధానం, ఫిర్యాదు చేసే ప్రక్రియ, పిల్లల రక్షణలో సమాజం బాధ్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు.విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు పోస్టర్ ప్రదర్శనలు, మైమ్ ప్రదర్శన, పరస్పర చర్చలు, ప్రశ్నోత్తర కార్యక్రమాలు నిర్వహించారు. మైమ్ ద్వారా బాలల భద్రత, అనుచిత ప్రవర్తనను గుర్తించడం, సహాయం కోరాల్సిన అవసరాన్ని సందేశాత్మకంగా వివరించగా, పోస్టర్ల ద్వారా "గుడ్ టచ్-బ్యాడ్ టచ్" అంశాలను వివరించి, అవసరమైతే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఐఎఫ్‌హెచ్‌ఈ యాజమాన్యం ఆర్థిక సహకారం అందించగా, డాక్టర్ ఎస్. కన్నన్, ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ లీగల్ ఎయిడ్ సొసైటీ సభ్యులు సమన్వయం చేశారు.

## ఎమ్మార్వో కార్యాలయంలో సమయపాలన పాటించని అధికారులు

- సమయపాలన పాటించని తహాశీల్దార్ కార్యాలయ సిబ్బందిపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తా
- అధికారులెవరూ కార్యాలయంలో లేరంటూ బిజెపి మండలాధ్యక్షుడి సెల్ఫీ వీడియో
- కార్యాలయానికి సరిపడ అధికారులు లేరంటూ తహాశీల్దార్ వివరణ



**జయభేరి, గజ్వేల్ /ములుగు 05 :**

ములుగు తహాశీల్దార్ కార్యాలయంలో అధికారులు సమయ పాలన పాటించడం లేదంటూ బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ ఖాళీ కుర్చీల సెల్ఫీ విడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. మండల కేంద్రమైన ములుగులోని తహాశీల్దార్ కార్యాలయంలో గురువారం 11 దాటిన అధికారులు కార్యాలయంకు రాలేదంటూ మండల అధ్యక్షుడు ఆరోపించారు. అధికారులు లేకపోవడంతో వివిధ పనులపై వచ్చిన ఆయా గ్రామాల్లోని రైతులు, ప్రజలు అధికారుల కోసం పడిగాపులు కాస్తున్నారని లక్ష్మణ్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే అధికారులకు మాత్రం మాకేం పట్టింపు లేదనట్లుగా వ్యహరిస్తున్నారని ఆయన అన్నారు. అధికారులు సకాలంలో కార్యాలయానికి రాకపోవడం వల్ల దూర గ్రామాల నుండి వచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లక్ష్మణ్ గౌడ్ అన్నారు. వచ్చిన అధికారులు సైతం పైరవీలు,సెల్ ఫోన్ లలో సంభాషణలకే తప్ప ప్రజా సమస్యలు పరిష్కారం చూపడం లేదన్నారు. సమయపాలన పాటించని,ప్రజా సమస్యలు పెడ చెవిన పెట్టే అధికారులపై జిల్లా కలెక్టర్ కి పిర్యాదు చేస్తామంటూ లక్ష్మణ్ గౌడ్ పేర్కొన్నారు. ఇదే విషయమై తహసిల్దార్ రవీందర్ రెడ్డిని వివరణ కోరగా కార్యాలయానికి సరిపడ సిబ్బంది లేరని,ఉన్న వారు గురువారం నాడు సెలవుల్లో ఉన్నారని తెలిపారు. అధికారుల కొరత గూర్చి జిల్లా అధికారులకు సైతం తెలియజేసినట్లుగా తహసిల్దార్ చెప్పారు.

## తల్లిపాలు.. బిడ్డలకు అమృతం

- తల్లిపాల ప్రాముఖ్యత చాటుతూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు
- సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 05 :**

తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్య పరిరక్షణలో వాటి పాత్ర, పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై తల్లులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ మాట్లాడుతూ, ప్రతి తల్లి తన బిడ్డకు జన్మించిన గంటలోపే తల్లిపాలు అందించాలని, తొలి ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలే ఇవ్వడం ద్వారా చిన్నారులు ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న తల్లి-శిశు సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఏఎన్ఎం భాగ్య తల్లిపాల వల్ల శిశువుకు అవసరమైన అన్ని పోషకాలు సహజసిద్ధంగా అందుతాయని, రోగ నిరోధక శక్తి పెరిగి అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వివరించారు. అలాగే గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిట్టా కిషన్, వార్డు సభ్యురాలు దానబోయిన రాణి, అంగన్‌వాడీ టీచర్లు వనమాల రాణి, ఎద్దు నీరజ,ఆశ భాగ్య మరియు గ్రామంలోని తల్లులు, చిన్నారులు, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## వర్షాలు సమృద్ధిగా కురవాలని..

- ముదిరాజుల సామూహిక వనభోజనాలు

**జయభేరి, సైదాపూర్ :**

ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో (EL nino) ప్రభావంతో భారతదేశంలో రుతుపవనాలు మందగించడంతో వర్షాల్లేక రైతులు ఇబ్బందులకు గురవుతుండగా వర్షాలు సమృద్ధిగా కురవాలని సైదాపూర్ మండలంలోని లాస్మన్నపల్లి గ్రామ ముదిరాజ్ కులస్తులు సామూహిక వనభోజనాలకు తరలి వెళ్లడం జరిగింది, ముదిరాజ్ కులస్తులందరూ మహిళలు ఇలా పాపలు వనదేవతలను గద్దెల రూపంలో వేచి వాటికి కొబ్బరికాయలు పూలు పళ్ళు సమర్పించి వర్షాలు కురువాలని వేడుకున్నారు, ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పెసరు కుమారస్వామి, మహిళా సంఘం అధ్యక్షురాలు నెల్లి వినీశా, సైదాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బైరి రాజు, నాయకులు రేగుల సమ్మయ్య, రేగుల తిరుపతి, రేగుల భూమయ్య, రేగుల చంద్రమోగిలి, రేగుల ఐలయ్య, నెల్లి సాయికృష్ణ, పెసరు తిరుపతి, పెసరు అశోక్, నాయకులు, మహిళలు, యువకులు, పాల్గొన్నారు.

## కాలనీవాసులు తమ వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి

- హబ్సిగూడ డివిజన్‌లోని స్ట్రీట్ నెం. 8లో పర్యటించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

హబ్సిగూడ డివిజన్ పరిధిలోని స్ట్రీట్ నెం. 8లో స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. కాలనీవాసులు తమ ప్రాంతంలో ఉన్న వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేలా సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని, ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు BRS పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు ఉత్తమ ఆహారం:- డా॥గీతా

- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అల్వాల్ పీహెచ్‌సీ-మెడిసిటీ సంయుక్తంగా అవగాహన సదస్సు



**జయభేరి, మేడ్చల్ :**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పిల్లల తల్లులు, గర్భిణీల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టత, అవసరం, వాటిపై ఉన్న అపోహలను వైద్య నిపుణులు వివరించారు. కార్యక్రమంలో మెడిసిటీ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. గీత మాట్లాడుతూ శిశువుకు తల్లిపాలే అత్యుత్తమమైన, సురక్షితమైన ఆహారమని అన్నారు. తల్లిపాలివ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని, ప్రతి తల్లి స్వయంగా బిడ్డకు పాలివ్వాలని సూచించారు.

మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ పీడియాట్రిక్ విభాగాధిపతి డా. సుదర్శన్ మాట్లాడుతూ తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి మాత్రమే కాకుండా భావోద్వేగ అనుబంధానికి, కుటుంబ వారసత్వ విలువలను కొనసాగించడానికీ దోహదపడతాయని తెలిపారు. తల్లిపాలపై ఉన్న అపోహలను నమ్మకుండా పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలే ఇవ్వాలని సూచించారు.

అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. శ్రీకాంత్ మాట్లాడుతూ తల్లిపాలకు ఆవు, గేదె పాలు లేదా డబ్బా పాలు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. అనంతరం మెడిసిటీ పీజీ విద్యార్థులు తల్లిపాల ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్రత్యేక స్కిట్ ప్రదర్శించారు. తల్లిపాలు, డబ్బా పాల మధ్య తేడాలు, శిశువుకు పాలిచ్చే సరైన విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు, గర్భిణీలు తల్లిపాల వల్ల శిశువుకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై విలువైన సమాచారం అందిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగిసిన అనంతరం తల్లులు, గర్భిణీలకు పండ్లతో పాటు ప్రత్యేకంగా తయారు చేసిన వేరుశనగ చిక్కీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా. గీత, డా. సుదర్శన్, డా. ఈనాక్షి గంగూలి, డా. సమీర్, డా. శ్రీకాంత్, జిల్లా సర్వేలెన్స్ అధికారి డా. నాగరాజు, మెడిసిటీ వైద్యులు, పీజీ విద్యార్థులు, పిల్లల తల్లులు, గర్భిణీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామం అభివృద్ధి

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 05 :**

బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వ ర్యంలో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని దొనికని రేణుక వెంకటేష్ యాదవ్ అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం తిరుమలాపూర్ గ్రామంలో బాలవికాస సంస్థ ఆదర్శ గ్రామ నిర్మాణంలో భాగంగా గ్రామసభను గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలవికాస సంస్థ 4 శతాబ్దాలుగా సామాజిక అభివృద్ధి పథకాలను చేపడుతూ పథకాల నిర్వహణకు ముందు జననిర్మాణ కార్యక్రమాలు నిర్వహిస్తూ, గ్రామాల్లో స్థిరమైన మార్పును అభివృద్ధిని సాధిస్తూ, కులమత, వర్గాలకు అతీతంగా ప్రజల భాగస్వామ్యంతో పథకాలను రూపొందిస్తున్నట్టు తెలిపారు.

వ్యక్తిగత సామాజిక అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందిస్తూ ప్రజలే నాయకులుగా యాజమాన్యులు గా లబ్ధిదారులుగా పథకాల నిర్వహణలోనూ కొనసాగింపులో జననిర్మాణమే ధ్యేయంగా సుస్థిర అభివృద్ధికి నాంది పలుకుతుందని అన్నారు. ప్రజల్లో అవగాహన ఉంటే ఆలోచన ఉంటుందని ఆలోచన బాగుంటే ఆచరణ బాగుంటుందని, ఆచరణలు బాగుంటే అభివృద్ధి బాగుంటుందని, మహిళా అభివృద్ధి, మంచి నీటి పథకాలు, రైతులకు సేద్యం ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటు వంటి అనేక పథకాలను నిర్వహిస్తూ గ్రామం తీర్చిదిద్దుతామని అన్నారు ఆదర్శ గ్రామ పథకం సీనియర్ ప్రాజెక్టు కో ఆర్డినర్ వసంత మాట్లాడుతూ ఆదర్శ గ్రామం అంటే రోడ్లు, భవనాలు, నిర్మించుకోవడం కాదని, వినూత్న కార్యకలాపాలను చేపడుతూ క్రమశిక్షణతో గ్రామ ప్రజలందరూ కట్టుబాట్లు, నియమాలు పద్ధతులు పెట్టుకొని వాటిని పాటిస్తూ ఊరంతా కలిసి ఒకే మాట, ఒకే బాట, ఐక్యంతో ఉంటే ఆదర్శ గ్రామం సాధించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి వెంకటేష్ బాలవికాస సంస్థ కోఆర్డినేటర్ రమేష్,డెవలప్మెంట్ ఏజెంట్ కృష్ణ ఏఎంసి చైర్మన్ చైతన్య డైరెక్టర్ నారాయణరెడ్డి వార్డు సభ్యులు ఉప సర్పంచ్ శ్రీను, కర్ణాకర్ రెడ్డి .స్వప్న,చైతన్య సుగుణమ్మ కర్ణాకర్ కర్ణాకర్ రెడ్డి గ్రామస్తులు, మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోరింటాకు కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం నాయుడు పాలెం పంచాయతీలో వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్ పిల్లలకు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోరింటాకు కార్యక్రమం నిర్వహించారు. ఆలాగే లంకెలపాలెం గ్రామంలో ప్రాధమిక పాఠశాలలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోరింటాకు ప్రాముఖ్యత వాటి విశేషాలు గురించి విద్యార్థులకి వివరిస్తూ అందరికి గోరింటాకు పెట్టారు.ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా మహిళా సహకన్వీనర్ పెదపాటి కృష్ణవేణి,స్కూల్ ఉపాధ్యాయులు గోవిందరాజు,హాస్టల్ వార్డెన్,కింతాడ వరలక్ష్మి, పి అరుణకుమారి, నెల్లి రేవతి, సాహు మంజు, వాణి, శారద, ఎర్ర అప్పారావు, కె భవానీ, ఎం ముత్యాలమ్మ , ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు పాల్గొన్నారు.

## లంకెలపాలెంలో డ్రగ్స్ పై వ్యతిరేక అవగాహన సదస్సు



**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ స్టేషన్ సీఐ లంక భాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం లంకెలపాలెం గ్రామంలో డ్రగ్స్ పై వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ లంక భాస్కరరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక దురాచారమని పేర్కొన్నారు. యువత డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక మరియు సామాజిక దుష్పరిణామాల గురించి వివరించి, మాదకద్రవ్యాల తయారీ, రవాణా, విక్రయం, నిల్వ మరియు వినియోగానికి సంబంధించిన నేరాలకు న్డీపీ చట్టం ప్రకారం కఠినమైన శిక్షలు విధించబడతాయని తెలియజేశారు. అదేవిధంగా డ్రగ్స్ విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 1972 లేదా అత్యవసర సేవల కోసం 112కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 60 మంది యువకులు పాల్గొనగా పరవాడ పోలీస్ స్టేషన్ పోలీసు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## ఆర్డీవో, ట్రైనీ సబ్ కలెక్టర్ కి బోకే అందించి శాలువాతో సన్మానించి ఆహ్వానం



**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి మండల కేంద్రంలో ఇటీవల ఎమ్మెల్యే ప్రారంభించిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంను నూతన ఎమ్మార్వో ఆఫీస్ గా తహసిల్దార్ ఆఫీస్ కట్టే అంతవరకు అద్దె భవనంలో కొనసాగుతున్న ఎమ్మార్వో ఆఫీస్ ను గుడిపల్లి గ్రామపంచాయతీ ఎదురుగా నూతన భవనంలోకి మార్చిన సందర్భంగా ఎమ్మార్వో ఆఫీస్ కి విచ్చేసిన దేవరకొండ ఆర్డీవో పద్మప్రియ, ట్రైనీ సబ్ కలెక్టర్ పవన్ కుమార్ కి బోకే అందించి శాలువాతో సన్మానించి సాదరంగా స్వాగతం పలికిన ఎమ్మార్వో మధుహాసిని గుడిపల్లి గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఇట్టి కార్యక్రమంలో గణపురం సర్పంచ్ తోటకూరి వెంకటయ్య గుడిపల్లి సెక్రటరీ విజయ్ రెడ్డి ఉప సర్పంచ్ అర్వపల్లి సీనయ్య వార్డు సభ్యులు కత్తుల రమేష్ మాజీ ప్రజా ప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా కళాశాల విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంధు చేయాలి

- సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ పిలుపు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలో బందుకు పిలుపునిచ్చారు. పెండింగ్లో ఉన్నటువంటి స్కాలర్షిప్లు ఫీజు రియంబర్స్మెంట్లు తక్షణమే అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా కళాశాల బందు పిలుపులో భాగంగా దేవరకొండ నియోజకవర్గం లో ఉన్నటువంటి అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు జూనియర్ ,డిగ్రీ కళాశాలు, వృత్తి విద్య కోర్సుల కళాశాలలు ఆగస్టు 7న తరగతుల బహిష్కరణ జరుగుతుంది. కావున కళాశాలు బందుకు పిలుపునిస్తున్నట్టు బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అందరూ స్వచ్ఛందంగా బందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, సొల్లేటి భాస్కరాచారి, సిగ శ్రీనివాస్, పెరికేటి వినయ్, మోతిలాల్, శ్యామ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ.. సీహెచ్. గోపాల్ రెడ్డి

- కండ్లకోయ సీఎంఆర్ హాస్పిటల్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల అవగాహన

**జయభేరి, మేడ్చల్ :**




ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కండ్లకోయలోని సీఎంఆర్ హాస్పిటల్‌లో తల్లిపాల ప్రాధాన్యతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎంఆర్ హాస్పిటల్, సీఎంఆర్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్. గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా సీఎంఆర్ హాస్పిటల్‌కు చెందిన పీజీ విద్యార్థులు తల్లిపాల విశిష్టత, శిశువుకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను నాటక రూపంలో ప్రదర్శించారు. తల్లిపాలపై ఉన్న అపోహలను తొలగిస్తూ శిశువుకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే ఉత్తమ ఆహారమనే సందేశాన్ని అందించిన ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. అనంతరం సీహెచ్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరం అని పుట్టిన గంటలోపే బిడ్డకు తల్లిపాలు పట్టించడం ద్వారా శిశువులో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తొలి ఆరు నెలల వరకు తల్లిపాలే సరిపోతాయని, తల్లిపాలు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడటమే కాకుండా తల్లీబిడ్డల మధ్య ఆప్యాయ అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. తల్లిపాలపై ఉన్న అపోహలను వీడి ప్రతి తల్లి తన బిడ్డకు స్వయంగా పాలివ్వాలని గోపాల్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ హాస్పిటల్ డీన్ వెంకటరమణయ్య, సీఈఓ రాజ్‌కుమార్, డా. నిహిత, డా. హరీష్, డా. సత్యనారాయణ, మేనేజర్ దుర్గాప్రసాద్ రెడ్డి, వైద్యులు, పీజీ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామ్ కీ ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధులు ప్రాధాన్యత ప్రాథమిక విద్య నాణ్యతకే

- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతుల పంపిణీ

**జయభేరి, పరవాడ:**




స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా రామ్ కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరిసర గ్రామాలైన తాడి, తానాం, పరవాడ ఫార్మాసిటీ కాలనీ, వాడచీపురుపల్లి, తిక్కవాణి పాలెం మరియు ఇస్లాంపేట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆగస్టు 15 వ రోజున విజేతలైన స్కూలు విద్యార్థులకు స్కూల్ యాజమాన్యం ఈ బహుమతులు అందజేయడం జరుగుతుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ బక్షి మాట్లాడుతూ.. సిఎస్ఆర్ నిధుల ద్వారా పరిసర గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యాభివృద్ధికి ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రామ్ కీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె. శ్రీకాంత్ మాట్లాడుతూ రామ్ కీ ఫౌండేషన్ సిబ్బంది గ్రామాల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రజల సహకారంతో వివిధ సామాజిక బాధ్యత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలకు గ్రామాల ప్రజల నుంచి మంచి ఆదరణ, ప్రశంసలు లభించడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో రిసిప్సా హెచ్ ఆర్ వెంకట సతీష్, రామ్ కీ ఫౌండేషన్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, శశిధర్, రాజేశ్వరి, హైమ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ మృతి పత్రికా రంగానికి తీరని లోటు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 05 :**



రవికుమార్ మృతి పత్రిక రంగానికి తీరని లోటని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన సాక్షి జర్నలిస్ట్ అనుభవిద్యల సంఘం మండల ప్రధాన కార్యదర్శి దుగ్యాల రవికుమార్ మరణించడంతో ఆయన పార్థీవదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ పత్రిక రంగంలో గత 30 సంవత్సరాలుగా కృషి చేసినట్లు ఆయన మృతి పత్రిక రంగానికి తీరని లోటని అన్నారు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వపరంగా ఆయన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ ,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సోమల వెంకటేశం, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య,గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు పెండెం రవి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి, బొమ్మలరామారం మండల బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోలగోని వెంకటేష్ గౌడ్, అడ్వకేట్ పడాల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బోరెడ్డి రామిరెడ్డి, మాజీ సర్పంచ్ పడాల చంద్రం, గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు, జర్నలిస్టులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులలో దూసుకుపోతున్న చిల్కానగర్ డివిజన్

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- 25 లక్షల రూపాయలతో వాటర్ పైప్ లైన్ శంకుస్థాపన

**జయభేరి, ఉప్పల్ :**



బీరప్ప గడ్డ డివిజన్లోని శ్రీ సాయిరాం నగర్ కాలనీ, ధర్మపురి కాలనీ, శ్రీనగర్ కాలనీకి సంబంధించిన సుమారు 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న మెయిన్ మంచినీటి పైప్ లైన్ శంకుస్థాపనకు ముఖ్య అతిథులుగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడమే మా ముఖ్య లక్ష్యం అని ఎమ్మెల్యే ఎలక్షన్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని దశలవారీగా పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని అన్నారు. బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పదవీకాలం పూర్తి అయిన కూడా ప్రజల అవసరాలను గుర్తిస్తూ నిరంతరం ప్రజలతో మమేకమై పని చేస్తూ ముందుకు సాగుతున్నారని అభినందించారు. అదేవిధంగా ఒక మంచి నాయకున్ని ఎన్నుకుంటే మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అహర్నిశలు కృషి చేస్తాడని, అదేవిధంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పనిచేస్తారని అన్నారు. కార్యక్రమంలో డీజీఎం సుప్రియ, మేనేజర్ కిష్టయ్య, వర్క్ ఇన్స్పెక్టర్ శేఖర్, సాయిరాం నగర్ కాలనీ , ధర్మపురి కాలనీ, శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీ మహిళలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాట్లు

**జయభేరి, దేవరకొండ :**



ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో పుణ్య క్షేత్ర దర్శిని పేరుతో తెలంగాణ రాష్ట్రంతో పాటు, అంతర్ రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఆధ్యాత్మిక కేంద్రాలకు ప్రత్యేక డీలక్స్,సూపర్ లగ్జరీ (పుష్ బ్యాక్ సీట్లు) బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయకుమారి తెలిపారు. ప్రస్తుత ఆషాడమాసం,రాబోయే శ్రావణమాసాన్ని పురస్కరించుకొని భక్తులకు ప్రత్యేకంగా పవిత్రమైన ప్రముఖ పుణ్య క్షేత్రాలను అతి తక్కువ సమయంలోనే సందర్శించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. అనుభవం కలిగిన డ్రైవర్ లకు ప్రత్యేక శిక్షణతో పంపించనున్నట్లు పేర్కొన్నారు. పుణ్య క్షేత్రాల వివరాలు.. 1.ఆలంపూర్, బీచ్ పల్లి, శ్రీరంగాపురం, జటప్రోలు, సోమశిల, కొల్లాపూర్, సింగోటం. 2.ధర్మపురి, కొండగట్టు, వేములవాడ, కొమురవెల్లి. 3.భద్రాచలం, మల్లూరు, మేడారం, రామప్ప దేవాలయం. 4.కాళేశ్వరం, భద్రకాళి టెంపుల్ (వరంగల్), వేయి స్తంభాల గుడి (హన్మకొండ). 5.పంచ దేవ పహాడ్, మఖ్తల్, మన్యంకొండ, కురుమూర్తి, గంగాపూర్. 6.విజయవాడ, పెద్దపులి పాక, పెనుగొండ, వాడపల్లి. 7.కొల్హాపూర్, జ్యోతిబా, పండరిపూర్, తుల్జాపూర్, గానగాపూర్. 8.మంత్రాలయం, పంచముఖి, దేవసుగూర్, మన్యంకొండ. పై యాత్రలే కాకుండా భక్తుల కోరిక మేరకు కనీసం 30 మంది ఉంటే వారు కోరుకున్న యాత్రా స్థలాలకు బస్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందరికీ అందుబాటు ధరలకు బస్సులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. దేవరకొండ ప్రాంత భక్తులు, ప్రయాణికులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9848847419 నెంబర్ కి గానీ, డిపోలో కానీ సంప్రదించాలని సూచించారు.




## కేంద్ర విధానాలను ఎండగడుతూ యువజన కాంగ్రెస్ పోరుబాట

- బోడుప్పల్ సర్కిల్‌లో బొమ్మక్ అజయ్ ఆధ్వర్యంలో స్టిక్కర్ ప్రచారం

**జయభేరి, మేడిపల్లి, ఆగస్ట్05 :**

మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ అజయ్ ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ స్టిక్కర్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ-షా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో శాంతియుతంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత, విద్యార్థులు, సామాన్య ప్రజల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజల గొంతుకను అణచివేయడం సాధ్యం కాదని, ప్రజా సమస్యలపై యువజన కాంగ్రెస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అజ్జు, చంద్రిక, మేడ్చల్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర రాహుల్ యాదవ్, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బద్దుల శ్రీకాంత్, అర్జున్ రెడ్డి, రాపోలు పవన్, రాపోలు రాము తదితరులతో పాటు జిల్లా వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

- శ్రీ భావన ఋషి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**

కాప్రా పద్మశాలి టౌన్‌షిప్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ పార్క్‌లో నిర్వహించిన శ్రీ భావన ఋషి వెల్ఫేర్ అసోసియేషన్ (SBRWA) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షురాలు దీప యెములతో పాటు కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, ఐక్యతను పెంపొందించే దిశగా అసోసియేషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. సామాజిక సేవ, పరస్పర సహకారం, ఐక్యతతో సమాజాభివృద్ధికి కృషి చేసే సంస్థలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం చేపట్టే ప్రతి మంచి కార్యక్రమానికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు సోమ శేఖర్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, BRS పార్టీ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## మహేష్ మృతి చాలా బాధాకరం

- బిఆర్ ఎస్ రాష్ట నాయకులుకేతావత్ భీల్యానాయక్

**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం కేంద్రానికి చెందిన BRS పార్టీ నాయకుడు ఐతపాక మహేష్ మృతి చాలా బాధాకరమని BRS పార్టీ రాష్ట్ర నాయకులుకేతావత్ భీల్యానాయక్ అన్నారు మహేష్ మృత దేహానికిపూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహేష్ కుటుంబానికి BRS పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలియజేస్తు మహేష్ కుటుంబ సభ్యులకు 15,000 /పదిహేను వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు మాజీ ఎంపీటీసీ ఎల్లంకి అశోక్, ఖలీద్, యాదయ్య, శంకర్, కృష్ణయ్య, స్వామి, పవన్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



# నెల రోజుల పాటు.. చక్కెర తినడం మానేసి చూడు

హైదరాబాద్ ఫిబ్రవరి 3 :

**మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.**

### కొవ్వు కరుగుతుంది..

డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

### కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్ధకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



# జంక్ ఫుడ్ మానేస్తే.. మీ ముఖంలో కనిపించే మార్పులు

**జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా సరే చాలామంది ఆ ఫుడ్ నే ఇష్టంగా తింటుంటారు. కానీ జంక్ ఫుడ్ ని ఒక 30 రోజులు మానేస్తే మీ శరీరంలో ఎన్ని మార్పులు జరుగుతాయో తెలుసా? ముఖ్యంగా ఫేస్ లో కనిపించే ఈ మార్పులు చూస్తే షాక్ అవుతారు.**

### 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే..

మనలో చాలామంది ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్, కేక్‌లు, చిప్స్ వంటి పదార్థాలను ఇష్టంగా తింటుంటారు. కానీ అవి మన శరీరం, ముఖ్యంగా చర్మంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసా? ఆరోగ్య నిపుణులు, స్కిన్ కేర్ ఎక్స్‌పర్ట్‌ల ప్రకారం కేవలం 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా ముఖంలో కలిగే మార్పులేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### మృదువుగా మారుతుంది

జంక్ ఫుడ్ ఎక్కువగా సాచ్యురేటెడ్ ఫ్యాట్స్, షుగర్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంలో ఇన్ఫ్లమేషన్ ను పెంచుతుంది. ముడతలు, ఎరుపు, పొడిబారడం వంటి సమస్యలకు కారణమవుతుంది. జంక్ ఫుడ్ మానేసిన వెంటనే, శరీరంలోని ఇన్ఫ్లమేటరీ రియాక్షన్స్ తగ్గుతాయి. 30 రోజుల్లో చర్మం సహజంగా హైడ్రేటెడ్ గా, మృదువుగా మారుతుంది. ముఖ్యంగా కేకులు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ మానడం వల్ల చర్మం.. లోపలి తేమను నిలుపుకోవడానికి అవకాశం ఉంటుంది.

### కొల్లాజెన్ ఉత్పత్తిపై ప్రభావం

షుగర్ అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలోని కొల్లాజెన్ దెబ్బతింటుంది. కొల్లాజెన్ శక్తిని కోల్పోవడం వల్ల చర్మంపై ముడతలు మొదలవుతాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా, కొల్లాజెన్ ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దానివల్ల చర్మం స్థిరంగా ఉంటుంది, ముడతలు తగ్గుతాయి. కాంతివంతంగా మారుతుంది.

### ముఖం స్లిమ్ గా కనిపించడం

జంక్ ఫుడ్ ఎక్కువగా సోడియం, ఫ్యాట్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో వాటర్ రిటెన్షన్, మలినాలు, ఫేస్ బ్లోటింగ్ కు కారణమవుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, 30 రోజులు జంక్ ఫుడ్ మానేసి.. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఫేస్ బ్లోటింగ్ తగ్గి ముఖం స్లిమ్ గా కనిపిస్తుంది. అలాగే, యాంటీ ఆక్సిడెంట్‌లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుంచి మెరుగుపడుతుంది.

### ముఖం ఫ్రెష్ గా..

జంక్ ఫుడ్ లోని ఫ్యాటీ, ప్రాసెస్డ్ పదార్థాలు శరీరంలోని యాంటీఆక్సిడెంట్ స్థాయిలను తగ్గిస్తాయి. చర్మం యూవీ కిరణాల ప్రభావానికి లోనవుతుంది. జంక్ ఫుడ్ మానేసి.. ఇతర ఫ్రూట్స్, వెజిటబుల్స్ తీసుకుంటే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మ రికవరీని వేగవంతం చేస్తాయి. సన్‌డ్యామేజ్ తగ్గి, చర్మం తాజాగా మారుతుంది.

### ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

చర్మంలో కనిపించే ఈ మార్పులు మానసికంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే.. ముఖం స్పష్టంగా మెరుస్తుంది, చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జంక్ ఫుడ్ మానేయడం ఒక్క చర్మ ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



# జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి?

**జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగడానికి మనం తలకు నూనె రాస్తుంటాం. తలపై నూనెతో స్మూత్ గా మసాజ్ చేస్తే ప్రశాంతంగా అనిపిస్తుంది. జుట్టు కుదుళ్లు కూడా బలపడతాయి. జుట్టు చక్కగా పెరగాలంటే ఎన్ని రోజులకు ఒకసారి నూనె రాయాలి? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా?**

మనం జుట్టుకు రెగ్యులర్ గా నూనె రాస్తుంటాం. దానివల్ల జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కానీ జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి? రోజూ రాయడం మంచిదా? లేక వారంలో ఒకటిరెండు సార్లు రాస్తే సరిపోతుందా? నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం.

### వారానికి 1-2 సార్లు

ఆరోగ్య నిపుణుల ప్రకారం జుట్టుకు వారానికి 1-2 సార్లు ఆయిల్ రాయడం మంచిది. సాధారణ లేదా డ్రై హెయిర్ ఉన్నవారు వారానికి రెండు సార్లు రాసుకోవచ్చు. ఆయిలీ స్కాల్ప్ ఉన్నవారు వారానికి ఒకసారి జుట్టుకు నూనె రాస్తే సరిపోతుంది. దానివల్ల స్కాల్ప్ ఉత్పత్తి చేసే సహజ నూనెలపై చెడు ప్రభావం పడదు.

### రోజూ రాస్తే ఏమవుతుంది?

సాధారణంగా చాలామంది రోజూ నూనె రాసుకుంటే జుట్టు బాగా పెరుగుతుందని అనుకుంటారు. కానీ దానివల్ల హెయిర్ ఫోలికల్స్ బలహీనపడే అవకాశం ఉంది. అంతేకాదు దుమ్ము, ధూళి వంటివి తలపై చేరి చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఫలితంగా చుండ్రు, ఇరిటేషన్, హెయిర్ ఫాల్ వంటి సమస్యలు ఎదురవుతాయి.

### నూనె వేడి చేసి రాస్తే..

ఆయిల్ వాడటం వల్ల జుట్టుకు హైడ్రేషన్ లభిస్తుంది. తలపై స్మూత్ గా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. అయితే చాలామంది నూనెను కొద్దిగా వేడి చేసి జుట్టుకు అప్లై చేస్తుంటారు. గోరువెచ్చని నూనెతో తలపై మసాజ్ చేస్తే.. జుట్టులోకి సులభంగా ఇమిడిపోతుంది. అలాగే రక్తప్రసరణ మెరగవుతుంది. కానీ నూనెను ఎక్కువ వేడి చేయడం మంచిది కాదు. అదే విధంగా జుట్టుపై బలంగా రుద్దడం కూడా ప్రమాదకరం అని నిపుణులు సూచిస్తున్నారు.

### ఎక్కువసేపు ఉంచితే?

జుట్టుకు నూనె రాసిన తర్వాత మరీ ఎక్కువసేపు ఉంచకూడదు. 45 నిమిషాల నుంచి 2 గంటల వరకు ఉంచితే సరిపోతుంది. దానికంటే ఎక్కువసేపు ఉంచితే.. ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు.

### ఏ నూనె వాడొచ్చు?

నిపుణుల ప్రకారం జుట్టు రకాన్ని బట్టి నూనెను ఎంచుకోవాలి. పొడి జుట్టుకు కొబ్బరి నూనె వాడొచ్చు. కొబ్బరినూనె జుట్టు లోపలి వరకు చొచ్చుకుపోయే గుణాలను కలిగి ఉంటుంది. అలాగే మందపాటి జుట్టుకు బాదం నూనె, జుట్టు పెరుగుదలకు ఆముదం నూనె వంటివి వాడొచ్చు.



# శోభిత ధూళిపాళ పాత వ్యాఖ్యలు మళ్లీ వైరల్..



అక్కినేని కుటుంబ కోడలు, ప్రముఖ నటి శోభిత ధూళిపాళ మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారారు. అయితే ఈసారి కారణం ఆమె కొత్త సినిమా కాదు.. గతంలో రాజకీయాలపై చేసిన వ్యాఖ్యలు. కొన్ని సంవత్సరాల క్రితం ఓ ఇంటర్వ్యూలో శోభిత వ్యక్తం చేసిన కామెంట్స్‌కి సంబంధించిన వీడియో ప్రస్తుతం మళ్లీ వైరల్ అవుతోంది. దీంతో నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయి తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శోభిత ధూళిపాళ తన రాజకీయ ఆలోచనల గురించి మాట్లాడుతూ… నాకు వామపక్ష భావజాలం ఎక్కువ. భవిష్యత్తులో ఏదో ఒక రోజు కమ్యూనిజమే గెలుస్తుంది అని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు పెద్దగా చర్చకు రాకపోయినా, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆ వీడియో మళ్లీ వైరల్ కావడంతో మరోసారి చర్చ మొదలైంది. వీడియో వైరల్ కావడంతో కొంతమంది నెటిజన్లు శోభిత వ్యాఖ్యలను విమర్శిస్తున్నారు. గ్లామర్ రంగంలో విజయవంతమైన కెరీర్‌తో పాటు లగ్జరీ జీవితాన్ని గడుపుతూ కమ్యూనిజం గురించి మాట్లాడటం విరుద్ధంగా ఉందంటూ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు అయితే, కమ్యూనిస్టు భావజాలంపై నమ్మకం ఉంటే ఆ సిద్ధాంతాలకు అనుగుణంగా జీవించాలని, కేవలం వ్యాఖ్యలు చేయడం సరిపోదంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.




## మాఫియా డ్రామా 'మకుటం'


హీరో విశాల్ స్వీయ దర్శకత్వంలో మూడు భిన్న పాత్రల్లో కనిపించనున్న యాక్షన్ థ్రిల్లర్ 'మకుటం' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. సముద్రతీర ప్రాంత నేపథ్యంలో ఎత్తుకుపై ఎత్తులతో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇదని సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న 99వ సినిమా ఇది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ నెల 7న ట్రైలర్‌ను రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విశాల్.. గ్యాంగ్‌స్టర్, ఓల్డ్ ఏజ్ డాన్, కార్పొరేట్ ఎంప్లాయిగా మూడు భిన్న అవతారాల్లో కనిపిస్తున్నారు. మాఫియా నేపథ్యంలో నడిచే ఈ కథలో విశాల్ పాత్ర చిత్రణ సరికొత్త పంథాలో ఉంటుందని, జీవీ ప్రకాష్‌కుమార్ మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తుందని, భారీ స్థాయిలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. దుషార విజయన్, అంజలి, తంబి రామయ్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కథ: రవి అరసు, నిర్మాత: ఆర్.బి.చౌదరి, దర్శకత్వం: విశాల్.

## అక్టోబర్‌లో సెట్స్‌పైకి 'బ్లడీ రోమియో'?



గత ఏడాది పవన్‌కళ్యాణ్ 'ఓజీ' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్నారు దర్శకుడు సుజీత్. ప్రస్తుతం ఆయన లైనప్‌లో 'ఓజీ' సీక్వెల్‌తో పాటు నానితో 'బ్లడీ రోమియో' సినిమా కూడా ఉంది. 'ఓజీ 2' సెప్టెంబర్‌లో ప్రారంభం కానుందనే వార్తలు కూడా వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం 'ఓజీ2' సినిమాకు బ్రేక్ ఇచ్చి 'బ్లడీ రోమియో'ను పట్టాలెక్కించేందుకు దర్శకుడు సుజీత్ సిద్ధమవుతున్నారని తెలిసింది. అక్టోబర్‌లో 'బ్లడీ రోమియో' సెట్స్‌పైకి వెళ్తుందని ఫిల్మ్‌నగర్ టాక్. అయితే ఈ విషయంలో నిజమెంతో తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం నాని 'ది ప్యారడైజ్' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా సెప్టెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. దీని తర్వాత 'బ్లడీ రోమియో'తో పాటు 'బ్లాస్ట్' ఫేమ్ సుభాష్‌కె రాజ్ డైరెక్షన్‌లో నాని ఓ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.

## 'బేబీ' జోడీ మళ్లీ వస్తోంది.. ఆనంద్ దేవరకొండ – వైష్ణవి చైతన్య 'ఎపిక్'




'బేబీ' సినిమాతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుని ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జోడీ మరోసారి వెండితెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. వీరిద్దరూ కలిసి నటిస్తున్న తాజా చిత్రం 'ఎపిక్' (Epic) విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్న నేపథ్యంలో మేకర్స్ విడుదల చేసిన ఈ అప్డేట్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. తాజాగా చిత్రబృందం ప్రకటించిన వివరాల ప్రకారం, 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 11న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేయగా, అభిమానుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. 'ఫస్ట్ సెమిస్టర్' అనే ట్యాగ్‌తో పోస్టర్‌ను విడుదల చేయడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ కాన్సెప్ట్ వెనుక కథ ఏమిటన్న దానిపై కూడా చర్చ మొదలైంది. ఈ చిత్రానికి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. యువతను ఆకట్టుకునే కథ, భావోద్వేగాలతో పాటు వినోదానికి ప్రాధాన్యం ఇస్తూ సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార కార్యక్రమాలు సినిమాపై పాజిటివ్ బజ్‌ను తీసుకొచ్చింది. ఈ చిత్రాన్ని తెలుగు సినీ పరిశ్రమలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న సితార ఎంటర్టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రముఖ నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ మరియు సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వారి బ్యానర్ల నుంచి వస్తున్న చిత్రం కావడంతో ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. యువ సంగీత దర్శకుడు అజీమ్ మొహమ్మద్ సంగీతాన్ని అందిస్తున్నారు. కథకు తగ్గట్టుగా సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను ప్రత్యేకంగా రూపొందిస్తున్నట్టు సమాచారం. 2023లో విడుదలైన 'బేబీ' చిత్రం ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కెరీర్‌లో భారీ మలుపు తీసుకొచ్చింది. వీరిద్దరి కెమిస్ట్రీకి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఇప్పుడు అదే జోడీ మరోసారి కలిసి నటిస్తుండటంతో 'ఎపిక్'పై సహజంగానే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమాలో కూడా వీరిద్దరి మధ్య భావోద్వేగభరితమైన కథ, కొత్త తరహా పాత్రలు ఉండనున్నట్టు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సెప్టెంబర్ 11 విడుదల తేదీ ప్రకటించడంతో 'ఎపిక్'పై సినీ అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. 'బేబీ' తర్వాత మరోసారి ఆనంద్ దేవరకొండ - వైష్ణవి చైతన్య జోడీ ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఇన్నాళ్లు ఎక్కడున్నారు మేడం..!



తమ అందాలతో హీరోయిన్స్‌ను మించి క్రేజ్ తెచ్చుకున్న భామల్లో ఈ అమ్మడు ఒకరు. తన నటనతో ప్రేక్షకులను మెప్పించిన ఈ చిన్నది.. తన అందంతో నెట్టింట రచ్చ చేస్తుంది. హీరోయిన్స్ కు మించి గ్లామర్ షోతో కట్టిపడేస్తుంది ఈ అమ్మడు. చాలా మంది ఈ చిన్నదాని అందానికి ఫిదా అవుతున్నారు. హీరోయిన్ కు ఏ మాత్రం తగ్గని వయ్యారం ఆమెది. ఆమె ఎవరో కాదు సీరియల్ లో తల్లిపాత్రల్లో నటించిన ఆమె సోషల్ మీడియాలో చేసే అరాచకం అంతా ఇంతా కాదు.. ఆమె ఎవరో కాదు జ్యోతి పూర్వజ్. సీరియల్లో చీరకట్టులో ఎంతో పద్దతిగా, హుందాతనంగా కనిపించే ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు మోడ్రన్ ఫోటోలతో మెస్మరైజ్ చేస్తుంది. ఇంతకీ ఆ వయ్యారి ఎవరు అనుకుంటున్నారు. గుప్పెడంత మనసు సీరియల్ ద్వారా తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు దగ్గరయ్యింది. అందులో తనదైన నటనతో మెప్పించింది. ఆ తర్వాత సీరియల్ నుంచి తప్పుకుంది. సీరియల్లో పద్దతిగా నటించిన జ్యోతి పూర్వజ్ నెట్టింట తన అందంతో మెప్పిస్తుంది. హాట్ హాట్ ఫోటోలతో హీట్ పుట్టిస్తుంది జ్యోతిరాయ్. అమ్మబాబోయ్ ఇంతందం పెట్టుకొని సీరియల్స్ లో నటించడం ఏంటండీ..? హీరోయిన్స్ కూడా పనికి రారు మీ ముందు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. నిజంగా హీరోయిన్స్ ఏమాత్రం తీసిపోని అందంతో మతి పోగొడుతుంది జ్యోతిరాయ్. అమ్మడి ఫోటోలు అదరగొడుతున్నాయి. అందాల ఆరబోతలోనూ ఏమాత్రం మొహమాట పడటం లేదు ఈ బ్యూటీ.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**